



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 12 సంచిక : 200 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం గురువారం 26 మార్చి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :12 ISSUE :200 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM THU 26 MARCH 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Visakhapatnam,Kakinada,Bapatla,NarasaraoPeta,Ongole,YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur

## ఇరాన్‌పై 15,000 బాంబులు వేశాం...
# 3 వేల లక్ష్యాలపై దాడులు

- యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ఈ బాంబులు వేశామని వెల్లడి
- గత జూన్ సంఘర్షణ కాలం నాటితో పోలిస్తే నాలుగు రెట్లు బాంబులు వేశామని వెల్లడి
- ప్రకటించిన ఇజ్రాయెల్ మంత్రి కాట్జ్



**పెన్ పవర్ డెస్క్:**యుద్ధం ప్రారంభమైన ఫిబ్రవరి 28వ తేదీ నుంచి ఇరాన్‌పై 15,000 బాంబులు వేశామని ఇజ్రాయెల్ ప్రకటించింది. ఈ మేరకు మంత్రి ఇజ్రాయెల్ కాట్జ్ మాట్లాడుతూ, గత ఏడాది జూన్ నెలతో పోలిస్తే నాలుగు రెట్లు ఎక్కువ బాంబులు వేశామని తెలిపారు. ఫిబ్రవరి 28వ తేదీన ఇరాన్‌పై అమెరికాతో కలిసి ఇజ్రాయెల్ యుద్ధం ప్రారంభించిన విషయం తెలిసిందే. యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి తమ సైన్యం 15 వేల బాంబులను ఇరాన్‌పై ప్రయోగించిందని కాట్జ్ వెల్లడించారు. గత ఏడాది జూన్‌లో 12 రోజుల పాటు జరిగిన సంఘర్షణ సమయంలో కంటే నాలుగురెట్లు బాంబులు ఉపయోగించినట్లు తెలిపారు.

- మిగతా2లో

# ఎల్పీజీ పేరుతో అదనపు ఛార్జీ వసూలు చేయొద్దు
## హెటళ్లు, రెస్టారెంట్లకు కేంద్ర ప్రభుత్వం హెచ్చరిక

- ఎల్పీజీ గ్యాస్ కొరతపేరుతో అదనపు చార్జీలు వసూలు చేస్తున్నాయన్న సీసీపీఏ
- హెల్ప్ లైన్ నెంబర్లకు ఫిర్యాదులు, మీడియాలో కథనాలు వచ్చినట్లు వెల్లడి
- అదనంగా ఛార్జీలు వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామన్న కేంద్రం

- మిగతా2లో



## పర్యాటకుల కోసం హోటల్ గదులు,
# హోమ్ స్టేలను పెంచండి

- పర్యాటక శాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు
- పర్యాటకులు మరింత పెరిగేలా ప్రణాళికలు రూపొందించాలన్న ముఖ్యమంత్రి
- కారావాన్ పార్కులు, టెంట్ సిటీల ఏర్పాటుకు చర్యలు
- పర్యాటక ప్రోత్సాహకానికి సీఎస్ అధ్యక్షతన కమిటీ



**పెన్ పవర్ డెస్క్:**రాష్ట్రంలో పెరుగుతోన్న పర్యాటకుల ఫుట్ ఫాల్‌కు అనుగుణంగా హోటల్ గదులు, హోం స్టేలను త్వరితగతిన అందుబాటులోకి తేవాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పర్యాటక శాఖకు దిశానిర్దేశం చేశారు. 2029 నాటికి రాష్ట్రంలో 50 వేల హోటల్ గదుల నిర్మాణం లక్ష్యాన్ని చేరుకోవాలని సూచించారు. అలాగే వివిధ పర్యాటక ప్రాంతాల్లో 10 వేలకు పైగా హోం స్టేలు కూడా అందుబాటులోకి తేవాలని స్పష్టం చేశారు. హోంస్టేలను అందుబాటులోకి తీసుకువచ్చే అంశంపై ఎలాంటి పరిమితీ లేదని వివరించారు. క్యాంపు కార్యాలయంలో బుధవారం పర్యాటక శాఖపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. సమీక్షకు మంత్రి కందుల దుర్గేష్, ఏపీటీడీసీ చైర్మన్ నూకసాని బాలాజీ సహా పర్యాటక శాఖ ఉన్నతాధికారులు హాజరయ్యారు. రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డులో ఆమోదం తెలియజేసిన టూరిజం ప్రాజెక్టులు వేగంగా ఏర్పాటు అయ్యేలా చూడాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలోని వివిధ పర్యాటక ప్రాంతాలు, నగరాల్లో జాతీయ, అంతర్జాతీయ హోటల్ బ్రాండ్లు వచ్చేలా చూడాలని సూచించారు. గోదావరి పుష్కరాల నాటికి కూడా రాజమహేంద్రవరం సహా వివిధ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున హోం స్టేల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలన్నారు. హోం స్టేల నిర్వహణకు సంబంధించి రేటింగ్ కూడా పెట్టాలని దిశానిర్దేశం చేశారు. అరకు, చింతపల్లి, ముంచింగిపుట్టు, గాంధీవనం, మారేడుమిల్లి తదితర ప్రాంతాలతో పాటు కనీసం 10-15 ప్రాంతాల్లో కారావాన్ పార్కులను ఏర్పాటు చేయాలని సూచించారు. కారావాన్లను పార్కింగ్ చేసుకుని కుటుంబంతో సురక్షితంగా ప్రకృతిని ఆస్వాదించేలా ఆయా పార్కుల్లో మౌలిక సదుపాయాలను కల్పించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. రాష్ట్రంలోని ఎక్స్ పీరియన్స్ కేంద్రాల వద్ద కూడా ఈ తరహా ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. తిరుపతి, విశాఖలలో అమ్యూజ్ మెంట్ పార్కుల ఏర్పాటుకు యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని సీఎం సూచనలు జారీ చేశారు.

అటవీ, దేవాదాయ శాఖల సమన్వయంతో ఎకో, టెంపుల్ టూరిజానికి ప్రోత్సాహం ఇచ్చేలా ప్రాజెక్టులు చేపట్టాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ప్రసాద్, స్వదేశ్ దర్శన్ పథకాల కింద వివిధ దేవాలయాలు, దర్శనీయ స్థలాల అభివృద్ధికి చేపట్టిన ప్రాజెక్టులను 2026 మే నాటికి సిద్ధం చేయాలని అన్నారు. దీనికి సంబంధించి మరో రూ.663 కోట్లతో కేంద్రానికి ప్రతిపాదనలు పంపినట్టు పర్యాటక శాఖ అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.

- మిగతా2లో

## చంద్రబాబుకు
# భయపడొద్దు..
## ఆ రోజులు పోయాయి: జగన్

- అద్దంకి నియోజకవర్గ వైసీపీ నేతలతో జగన్ సమావేశం
- ప్రతి విషయంలో క్రెడిట్ చోరీ చేస్తున్నారని విమర్శ
- మిట్టల్ స్టీల్ ప్లాంట్ మన హయాంలోనే రాష్ట్రానికి వచ్చిందని వ్యాఖ్య

**పెన్ పవర్ డెస్క్:** వైసీపీ అధినేత జగన్ ప్రకాశం జిల్లా అద్దంకి నియోజ కవర్గ పార్టీ నేతలతో కీలక సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వంపై, ముఖ్యంగా సీఎం చంద్రబాబుపై ఆయన నిప్పులు చెరిగారు. పాలనలో అంతా తనదే అన్నట్టుగా చంద్రబాబు వ్యవహరిస్తున్నారని, ప్రతి చిన్న విషయంలో 'క్రెడిట్ చోరీ' చేస్తున్నారని మండిపడ్డారు. ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ మన హయాంలోనే రాష్ట్రానికి వచ్చిందని, కానీ ఇప్పుడు తన వల్లే వచ్చినట్టుగా చంద్రబాబు 'బిల్డప్' ఇస్తున్నారని జగన్ ఎద్దేవా

- మిగతా2లో





## జగన్ జీవితం జంగిల్
# బుక్ లాంటిది

- అరాచకం, అబద్ధాలే తప్పించి వాస్తవాలు ఏనాడూ మాట్లాడలేదని విమర్శ
- అసెంబ్లీకి రాకుండా బయట విమర్శలు చేయడం జగన్ బలహీనతకు నిదర్శనమని వ్యాఖ్య
- వేగంగా జరుగుతున్న అభివృద్ధి, ప్రజా సంక్షేమం చూసి జగన్ ఓర్వలేకపోతున్నారని ఆగ్రహం

- మిగతా2లో

## అమరావతి 'ఐకానిక్' టవర్లు రెడీ అవుతున్నాయి..
### డయాగ్రిడ్ టెక్నాలజీతో అద్భుత నిర్మాణం



- అమరావతిలో వేగం పుంజుకున్న ఐకానిక్ టవర్ల పనులు
- హెచ్ఓడీ టవర్-3 వద్ద 'కార్నర్ నోడ్' అమర్చే పనులను ప్రారంభించిన నారాయణ
- అమరావతి నిర్మాణానికి ప్రజల పన్నుల నుంచి ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయడం లేదని వెల్లడి

- మిగతా2లో

# ఇండియన్ కలినరీ ఇనిస్టిట్యూట్‌తో ఏపీ పర్యాటక శాఖ ఎంఓయూ

- ముఖ్యమంత్రి సమక్షంలో కుదిరిన చారిత్రాత్మక ఒప్పందం
- తెలుగు రుచులను ప్రపంచానికి పరిచయం చేయడంలో వర్సిటీ సహకారం
- ఏపీని కలినరీ టూరిజం హబ్‌గా తీర్చిదిద్దడానికి దోహదపడనున్న ఎంఓయూ

**పెన్ పవర్ డెస్క్:**ఆంధ్రప్రదేశ్ ను కలినరీ టూరిజం హబ్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ తిరుపతిలోని ఇండియన్ కలినరీ ఇనిస్టిట్యూట్ తో అవగాహనా ఒప్పందం చేసుకుంది. ముఖ్యమంత్రి

- మిగతా2లో



## 'వందేమాతరం' పాడటం
# తప్పనిసరి కాదు



- 'వందేమాతరం' సర్క్యులర్‌ను సవాలు చేసిన పిటిషన్ కొట్టివేత
- ఆదేశాలు కేవలం సలహా మాత్రమేనని, తప్పనిసరి కాదని చెప్పిన సుప్రీంకోర్టు
- ప్రభుత్వ సర్క్యులర్‌లో శిక్షార్హమైన చర్యలు లేవని స్పష్టం చేసిన ధర్మాసనం
- పరోక్ష ఒత్తిడి ఉంటుందన్న పిటిషనర్ వాదనలు ఊహాజనితమన్న కోర్టు
- దేశభక్తిని బలవంతం చేయలేరని వాదించిన సీనియర్ న్యాయవాది

- మిగతా 2లో




## భాగ్యనగరంలో ప్రయాణికులకు
# ఆర్టీసీ శుభవార్త

- మెట్రో, ఏసీ డీలక్స్ బస్సుల్లో 30 శాతం రాయితీ
- పెట్రోల్, డీజిల్ కొరత నేపథ్యంలో ప్రయాణికులకు ఊరట
- ఆర్టీసీ బస్సులు ఉండగా పెట్రోల్ కష్టాలు దండుగ అంటూ ఆర్టీసీ ఎండీ ఆసక్తికర వ్యాఖ్య

- మిగతా2లో

# అమెరికా విమాన వాహకనౌక లక్ష్యంగా క్షిపణి దాడులు చేశాం
## హెచ్చరించిన ఇరాన్ ప్రకటన

- యూఎస్ఎస్ అబ్రహం లింకన్ లక్ష్యంగా ఇరాన్ క్రూయిజ్ క్షిపణితో దాడి
- విమాన వాహన నౌక కదలికలను పరిశీలిస్తున్నామని అంతకుముందే ఇరాన్ ప్రకటన
- ఆ తర్వాత గంటలోపు క్షిపణితో దాడి చేసిన ఇరాన్

- మిగతా2లో



# ఎడిటర్ వ్యూ

## యూరియాపై పశ్చిమాసియా ప్రభావం

రానున్న ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి యూరియా నిల్వలు తగినంతగా ఉన్నాయని, వ్యవసాయానికి ఎలాంటి ఆటంకం ఏర్పడదని కేంద్ర ప్రభుత్వం చెబుతున్నప్పటికీ పరిస్థితులు అనూహ్యంగా ఉంటున్నాయి. మార్చి 10 నాటికి భారత్‌లో యూరియా నిల్వలు 61.5 లక్షల మెట్రిక్ టన్నుల వరకు ఉన్నాయని, అంటే గత ఏడాది ఇదే సమయంలో ఉండే నిల్వల కన్నా 10 లక్షల టన్నుల వరకు అధికంగా ఉన్నాయని ప్రభుత్వం చెబుతోంది. పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధం ప్రపంచ వాణిజ్యాన్ని అల్లకల్లోలం చేస్తోం ది. ఈ సంక్షోభం వ్యవసాయానికి ప్రధాన అవసరమైన యూరియా తయారీకి కావలసిన లిక్విఫైడ్ నేచరల్ గ్యాస్ (ద్రవీకృత సహజవాయువుఎల్ఎన్‌జి) సరపరాపై తీవ్ర ప్రభావం చూపిస్తోంది. యుద్ధం ప్రకంపనలు ఇప్పటికే భారత్ యూరియా సరఫరాను దెబ్బతీస్తున్నాయి. ఆదివారం (మార్చి 22) నాటికి భారత్ లోని యూరియా ప్లాంట్లు సగం సామర్థ్యంతో నడుస్తున్న పరిస్థితి ఏర్పడింది. కొన్ని యూరియా కంపెనీలు ప్లాంట్లను మూసివేసే పరిస్థితులు ఏర్పడ్డాయి. భారత్ అతిపెద్ద ఎల్ఎన్‌జి దిగుమతిదారైన పెట్రోనెట్ ఎల్ఎన్‌జి సంస్థ ఖతార్ నుండి దీర్ఘకాలిక ఒప్పందాల ద్వారా గ్యాస్ సరఫరాను నిర్వహించడం పరిపాటిగా వస్తోంది. ఇటీవల ఖతార్‌లోని రాస్‌లాఫాన్‌లో యుద్ధంవల్ల గ్యాస్ సరఫరా వ్యవస్థకు నష్టం జరగడంతో ఒప్పందం ప్రకారం సరఫరా చేయలేనని పెట్రోనెట్ చేతులుఎత్తేసింది. ఈ చర్య కేంద్ర ప్రభుత్వ యాజమాన్యం లోని గెయిల్ (ఇండియా), ఇండియా ఆయిల్ కార్పొరేషన్ సంస్థ, భారత్ పెట్రోలియం కార్పొరేషన్ వంటి గ్యాస్ పంపిణీదారుల ద్వారా సరఫరా కోతకు దారి తీసింది. ఎల్ఎన్‌జి సరఫరా కోసం భారత్ భారీగా దిగుమతులపైనే ఆధారపడుతోంది. భారత్ రోజూ 4.7 మిలియన్ బ్యారెళ్ల ముడి చమురును, అంటే తన అవసరాల్లో 88%, అలాగే 47% సహజవాయు డిమాండ్ కోసం ద్రవీకృత సహజవాయువును విదేశాలనుంచి దిగుమతి చేసుకుంటోంది. దీనివల్ల ప్రపంచ మార్కెట్‌లో యూరియా ధరలు పెరగడమే కాకుండా ఎరువులపై భారత ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలపై కూడా ప్రభావంపడే అవకాశం కనిపిస్తోంది. యూరియా కొరతవల్ల వ్యవసాయ ఉత్పాదక ఖర్చులు పెరగడమే కాకుండా ద్రవ్యోల్బణం పెరిగే అవకాశం ఉంది. 2025లో అంతర్జాతీయ మార్కెట్ నుంచి 50% పైగా సహజవాయువు (ఎల్ఎన్‌జి)ను భారత్ దిగుమతి చేసుకుంది.

ప్రపంచం మొత్తంమీద భారీస్థాయిలో ఎల్ఎన్‌జి నాలుగో కొనుగోలుదారు భారత్‌యే. 2025లో 261 లక్షల మెట్రిక్ టన్నుల ఎల్ఎన్‌జిని భారత్ దిగుమతి చేసుకుంది. ఇందులో 40% ఖతార్ నుంచి మిగతా 20% యుఎఇ, ఒమన్ ద్వారా సరఫరా అవుతుంది. ఈ ఎల్ఎన్‌జి అంతా హోర్ముజ్ జలసంధి ద్వారానే నౌకల మీదుగా రవాణా అవుతుంది. మొత్తం మీద భారత్ దిగుమతి చేసుకునే ఎల్ఎన్‌జి 60% వరకు హోర్ముజ్ జలసంధి మూసివేయడంవల్ల అంతరాయం ఏర్పడుతోంది. భారత్‌లో అమోనియా తయారీకి తద్వారా ఎరువుల తయారీకి ప్రధానంగా సహజవాయువునే వినియోగిస్తుంటారు. 2026లో భారత్‌కు సరఫరా అయిన ఎల్ఎన్‌జిలో 30% ఎరువుల తయారీకే వినియోగం కావడం గమనార్హం. యూరియా ఉత్పత్తికి ఎల్ఎన్‌జి ప్రధాన వనరు. దేశంలో ఎరువులుగా యూరియానే ఎక్కువగా వాడుతుంటారు. యూరియా ఉత్పత్తి అత్యంత ఇంధన వినియోగతో కూడిన ప్రక్రియ. ఈ యూరియా ప్లాంట్లు తక్కువ ఉద్గారాలను విడుదల చేసే సహజవాయువు వినియోగంలోకి మారాయి. జాతీయ స్థాయిలో యూరియా వినియోగం గత దశాబ్దకాలంలో క్రమంగా పెరిగి 2025లో 387 లక్షల మెట్రిక్ టన్నులకు పెరిగింది. 2025లో స్వదేశీ యూరియా ఉత్పత్తి కూడా దాదాపు 306 లక్షల మెట్రిక్ టన్నుల వరకు జరిగినా దేశం మొత్తం మీద డిమాండ్‌ను నెరవేర్చలేకపోతోంది. అందువల్ల భారత్ యూరియా దిగుమతులపై ఆధారపడవలసి వస్తోంది. ఈ నేపథ్యంలో పశ్చిమాసియాలో యుద్ధ బీభత్సం స్వదేశీ యూరియా ఉత్పత్తిని, సరఫరాను దెబ్బతీస్తోంది. 2025లో భారత్ యూరియా దిగుమతులు 2300 లక్షల మెట్రిక్ టన్నుల వరకు ఉన్నాయి. ఈ దిగుమతుల్లో 71% పశ్చిమాసియా నుంచి రావలసి ఉండగా, ఇందులో 45% ఒమన్, సౌదీఅరేబియా, ఖతార్, యుఎఇ నుంచి సరఫరా అవుతుంటాయి. ఈ మొత్తం సరఫరా హోర్ముజ్ జలసంధిద్వారా రవాణా కావలసి ఉంది. ఈ నేపథ్యంలో సహజవాయువు సరఫరా నియంత్రణ ఉత్తర్వు 2026ను భారత ప్రభుత్వం జారీ చేసింది. ఇందులో ఎరువుల రంగాన్ని ప్రాధాన్యత జాబితాలో చేర్చింది. రెండు మూడేళ్ల క్రితం ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం ప్రారంభించినప్పుడు కూడా ఇంధనం, ఎరువుల సరఫరా విషయంలో కూడా భారత్ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవలసి వచ్చింది. ఎరువుల తయారీకి ప్రాధాన్యం ఇచ్చి స్వదేశీయంగా సబ్సిడీ ధరకు గ్యాస్ లభిస్తేనే ఎరువులు ఉత్పత్తి అవుతాయి. రష్యా, ఉక్రెయిన్ యుద్ధం వల్ల కూడా పొటాష్ సరఫరా దెబ్బతింది. ప్రపంచ దేశాలకు సరఫరా అయ్యే యూరియాలో 14% ఒక్క రష్యా నుంచే సరఫరా అవుతోంది. డిఎపిలో రష్యా సరఫరా దాదాపు 10% వాటాతో రెండో ఉత్పత్తిదారుగా రష్యా ఉంటోం ది. పొటాష్‌లో కావలసినవి 50% రష్యా, బెలారస్ నుంచే రప్పించుకోక తప్పదు. భారత్ డిఎపి డిమాండ్‌లో దాదాపు 60% చైనా, సౌదీఅరేబియా నుంచే లభిస్తోంది. ఇప్పుడు సౌదీఅరేబియా కూడా యుద్ధ బాధిత దేశంగా ఉండడంతో డిఎపి సరఫరా దెబ్బతింటోంది. భారతదేశానికి సరఫరాలో ఇబ్బందులే కాకుండా దిగుమతుల వ్యయం బిల్లుకూడా అమాంతంగా పెరిగే ప్రమాదం ఏర్పడే పరిస్థితి ఉందని వాణిజ్యవర్గాలు ఆందోళన చెందుతున్నాయి.

# పర్యాటకుల కోసం హోటల్ గదులు, హోమ్ స్టేలను పెంచండి

- మొదటి పేజీ తరువాయి

గండికోట, సూర్యలంక, అరకు బొర్రా గుహలు తదితర ప్రాంతాలను ప్రముఖ పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకు అవసరమైన కార్యాచరణ చేపట్టాలన్నారు. గోదావరి పుష్కరఘాట్‌ను ఆగస్టు నాటికి, హావ్ లాక్ బ్రిడ్జిపైకి పర్యాటకులను అనుమతించేలా ఈ ఏడాది డిసెంబరు నాటికి పనులు పూర్తి చేయాలని సీఎం స్పష్టం చేశారు.

**పర్యాటక ప్రోత్సాహానికి సీఎస్ అధ్యక్షతన కమిటీ**

రాష్ట్రంలో పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు ప్రత్యేకంగా ఓ బోర్డు లేదా కమిటీ ఏర్పాటు చేసి ప్రాజెక్టులను ముందుకు తీసుకువెళ్లాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. పర్యాటకశాఖ, అటవీ, దేవాదాయ, పోలీసు, మెరైన్ ఇలా వేర్వేరు శాఖల సమన్వయం కోసం సీఎస్ అధ్యక్షతన దీనిని ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. హౌస్ బోట్లు, హెలీ టూరిజంతో పాటు ఉడాన్ పథకం కింద సీ ప్లేన్‌లను కూడా ప్రోత్సహించాలని అన్నారు.విశాఖ, విజయవాడ, శ్రీశైలం, గండికోట, కంభం చెరువు లాంటి చోట్ల వాటర్ ఏరో డ్రోమ్స్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం అందించాలని సూచించారు. సముద్ర విహారాన్ని ప్రోత్సహించేలా విశాఖ, నెల్లూరులోని కృష్ణపట్నం పోర్టుల నుంచి క్రూజ్ నౌకలను కూడా నిర్వహించేలా చూడాలన్నారు. తెలంగాణా లాంటి ల్యాండ్ లాక్డ్ రాష్ట్రాల నుంచి కూడా పర్యాటకులు దీనికి పెద్ద ఎత్తున ఆకర్షితులు అవుతారన్నారు.రాష్ట్రంలోని వేర్వేరు ప్రాంతాల్లో ఏర్పాటు చేసే టెంట్ సిటీలను కేటగిరీలుగా విభజించి ప్రోత్సహిస్తే అందరికీ అందుబాటులోకి వస్తాయన్నారు. కనీసం వెయ్యి టెంట్ సిటీలను గోదావరి పుష్కరాల నాటికి అందుబాటులోకి తేవాలని ముఖ్యమంత్రి సూచనలు జారీ చేశారు. క్రియేటివ్ ఎకనామినీ ప్రోత్సహించేందుకు కంటెంట్ క్రియేషన్ పెద్ద ఎత్తున జరగాలన్నారు. క్రియేటివ్ ఎకానమీని సృష్టించేలా అమరావతి క్రియేటివ్ సిటీగా ఎదగాలన్నారు.

బాలివుడ్ స్టార్ సంజయ్ దత్ కూడా క్రియేటివ్ ఎకనామీ ప్రాజెక్టు ఏర్పాటు చేసేందుకు ఆసక్తి చూపించారన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన ఐకానిక్ డెస్టినేషన్ స్కీమ్ కింద విశాఖ, తిరుపతి నగరాలను అభివృద్ధి చేయాలని.. ప్రతీ ఐకానిక్ డెస్టినేషన్ కు రూ.500 కోట్ల వరకూ వెచ్చించేందుకు ఆస్కారం ఉందని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. గత ఏడాదిలో పర్యాటక ప్రాంతాలకు 30.92 కోట్ల మంది పర్యాటకుల ఫుట్ ఫాల్ నమోదైందని, ఈ ఏడాదిలో 9 నెలల కాలానికి గానూ 21 శాతం మేర వృద్ధి కనిపించిందని, ఇది మరింత పెరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రధాన ఆలయాలను అనుసంధానించి టెంపుల్ టూరిజం కూడా ఇంటిగ్రేట్ చేయాలని సీఎం సూచించారు. సూర్యలంక బీచ్‌ను ప్రత్యేకంగా అభివృద్ధి చేసేందుకు యాక్షన్ ప్లాన్ చేపట్టాలన్నారు. వీటితో పాటు తిరుపతిలో ఉన్న చెరువులు, అమరావతి ప్రాంతంలోని కాలువలు, విశాఖ సహా వేర్వేరు ప్రాంతాలను సుందరీకరణ చేపట్టాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

## ఎల్పీజీ పేరుతో అదనపు ఛార్జీ వసూలు చేయొద్దు

### హోటళ్లు, రెస్టారెంట్లకు కేంద్ర ప్రభుత్వం హెచ్చరిక

హోటళ్లు, రెస్టారెంట్లకు కేంద్ర ప్రభుత్వం కీలక మార్గదర్శకాలు జారీ చేసింది. ఎల్పీజీ పేరుతో అదనపు చార్జీలు వసూలు చేయకూడదని స్పష్టం చేసింది. గ్యాస్ కొరతను చూపిస్తూ అదనపు సేవల ఛార్జీ వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని కేంద్ర వినియోగదారుల పరిరక్షణ అథారిటీ (సీసీపీఏ) హెచ్చరించింది. దేశవ్యాప్తంగా ఎల్పీజీ గ్యాస్ కొరత పేరుతో కొన్ని హోటళ్లు, రెస్టారెంట్లు అదనపు ఛార్జీలు వసూలు చేస్తున్నట్లు వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలో సీసీపీఏ స్పందించింది. ఎల్పీజీ గ్యాస్ పేరుతో కొన్నిహోటళ్లు, రెస్టారెంట్లు వినియోగదారుల నుంచి అదనంగా ఛార్జీలు వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి

వచ్చినట్లు తెలిపింది. హెల్ప్ లైన్ నెంబర్లకు ఫిర్యాదులు వచ్చాయని, మీడియాలో కూడా వార్తలు వచ్చాయని వెల్లడించింది. మెనూలో పేర్కొన్న ధరలను మాత్రమే వసూలు చేయాలని, అదనంగా ఎలాంటి చార్జీలు ఉండకూడదని స్పష్టం చేసింది.

## జగన్ జీవితం జంగిల్ బుక్ లాంటిది

వైకాపా అధినేత జగన్‌మోహన్‌రెడ్డి జీవితం 'జంగిల్ బుక్'లా మారిందని ఆంధ్రప్రదేశ్ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి విమర్శించారు. అరాచకం, అబద్ధాలు తప్పించి వాస్తవాలను ఏనాడూ మాట్లాడని నాయకత్వం ఆయనదేనని ఎద్దేవా చేశారు. ఐదేళ్ల పాలనలో అవినీతి, అక్రమాలు, ప్రజా ధనం దోపిడీ చేసి రాష్ట్రాన్ని దెబ్బతీశాడని ఆరోపించారు. అందుకే ప్రజలు ఆయనకు గట్టి బుద్ధి చెప్పి కేవలం 11 అసెంబ్లీ సీట్లకే పరిమితం చేశారని అన్నారు. ప్రజా తీర్పును గౌరవించకుండా, అసెంబ్లీకి రాకుండా బయట విమర్శలు చేయడం ఆయన బలహీనతకు నిదర్శనమని అన్నారు. గతంలో ఫ్రాంక్లిన్ టెంపుల్‌టన్, హెచ్ఎస్‌బీసీ, ఐబీఎం వంటి ప్రముఖ కంపెనీలను రాష్ట్రం నుంచి తరిమేసింది నాటి జగన్ ప్రభుత్వమేనని అన్నారు. నేడు కూటమి ప్రభుత్వం ఆ పరిస్థితులను మార్చి గూగుల్, టీసీఎస్, అర్సెలార్ మిట్టల్, కాగ్నిజెంట్, ఐబీఎం వంటి ప్రతిష్ఠా త్మక సంస్థలను రాష్ట్రానికి తీసుకువస్తోందని పేర్కొన్నారు. ఇది తమ ప్రభుత్వంపై పెట్టుబడిదారుల్లో ఉన్న నమ్మకానికి నిదర్శనమని మంత్రి అన్నారు. జగన్ పాలనలో చేసిన ఆర్థిక విధ్వంసం నుంచి రాష్ట్రాన్ని బయటకు తీసుకురావడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తూ పెట్టుబడులకు స్వర్గధామిగా ఆంధ్రప్రదేశ్‌ను నిలుపుతోందని అన్నారు. రాష్ట్రానికి వస్తున్న పెట్టుబడులు, యువతకు లభిస్తున్న ఉపాధి అవకాశాలు, వేగంగా జరుగుతున్న అభివృద్ధి, ప్రజలకు అందుతున్న సంక్షేమాన్ని చూసి జగన్ ఓర్వలేకపోతున్నారని విమర్శించారు.అందుకే ప్రతిసారి గుమ్మం కూడా దాటకుండా ఇంట్లో ప్రెస్ మీట్ ద్వారా లేదా తన పార్టీ నేతలతో సమావేశమై కూటమి ప్రభుత్వంపై బురద జల్లడమే పనిగా పెట్టుకొని పని చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ రెడ్డి ఎన్ని కుట్రలు, కుతంత్రాలు, దుష్ప్రచారాలు చేసినా ప్రజలు తమ ప్రభుత్వంపై ఉంచిన విశ్వాసాన్ని ఏమాత్రం దెబ్బతీయలేరని అన్నారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం దృఢంగా ముందుకు సాగుతుందని జనార్ధన్ రెడ్డి అన్నారు.

## అమరావతి 'ఐకానిక్' టవర్లు రెడీ అవుతున్నాయి..

రాజధాని అమరావతిలో రాష్ట్ర స్థాయి అధికారులందరూ ఒకే చోట కొలువుదీరేలా నిర్మిస్తున్న ఐదు ఐకానిక్ టవర్ల పనులు వేగవంతమయ్యాయి. ఈరోజు హెచ్ఓడీ టవర్-3 వద్ద 'కార్నర్ నోడ్' అమర్చే పనులను మంత్రి నారాయణ ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అత్యాధునిక డయాగ్రిడ్ సాంకేతికతతో ఈ భవనాలను నిర్మిస్తున్నట్లు ఆయన వెల్లడించారు.అమరావతి నిర్మాణానికి ప్రజలు చెల్లించే పన్నుల నుంచి ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయడం లేదని మంత్రి స్పష్టం చేశారు. సీఎం చంద్రబాబు రూపొందించిన ప్రత్యేక ఫైనాన్స్ మోడల్ ద్వారానే ఈ నిధులు సమకూరుతున్నాయని, అమరావతి ఒక 'సెల్ఫ్ ఫైనాన్స్ సిటీ' అని ఆయన గుర్తు చేశారు. గత ఏడాది కురిసిన భారీ వర్షాల వల్ల సుమారు 4 నెలల పాటు పనులకు అంతరాయం కలిగిందని, ఇప్పుడు పనుల వేగాన్ని పెంచామని తెలిపారు. ఐకానిక్ భవనాలతో పాటు ప్రజాప్రతినిధులు, అధికారుల నివాస సముదాయాల పనులు కూడా తుది దశకు చేరుకున్నాయని వివరించారు.

రాయపూడి వద్ద జరిగిన అగ్నిప్రమాదంపై సీఎం ఇప్పటికే సమీక్షించారని, ఒకవేళ ఎవరైనా ఉద్దేశపూర్వకంగా ఈ ప్రమాదానికి పాల్పడి ఉంటే వారిపై కఠిన చర్యలు తప్పవని మంత్రి హెచ్చరించారు. ప్రస్తుతం దీనిపై పూర్తిస్థాయి విచారణ జరుగుతోందని చెప్పారు.

**డయాగ్రిడ్ టెక్నాలజీ అంటే ఏమిటి?**

ఈ టవర్ల నిర్మాణంలో వాడుతున్న డయాగ్రిడ్ టెక్నాలజీ వల్ల భవనానికి లోపల పిల్లర్లు ఉండాల్సిన అవసరం తక్కువగా ఉంటుంది. దీనివల్ల లోపల స్థలం ఎక్కువగా లభిస్తుంది. ఉక్కును త్రిభుజాకారపు గ్రిడ్లుగా అమర్చడం వల్ల భవనానికి అద్భుతమైన పటుత్వంతో పాటు ఒక ఆధునిక లుక్ వస్తుంది.

# 'వందేమాతరం' పాడటం తప్పనిసరి కాదు

ప్రభుత్వ, అధికారిక కార్యక్రమాల్లో జాతీయ గేయం 'వందేమాతరం' పాడాలంటూ కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన సర్క్యులర్‌ను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌ను విచారించేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ఆ సర్క్యులర్ కేవలం సలహా పూర్వకమైనదే తప్ప, తప్పనిసరి కాదని స్పష్టం చేసింది. అందులో ఎలాంటి శిక్షార్హమైన చర్యలు పేర్కొననందున, ఈ పిటిషన్‌పై విచారణ తొందరపాటు అవుతుందని అభిప్రాయపడింది.భారత ప్రధాన న్యాయమూర్తి (CJI) సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్యా బాగ్చి, జస్టిస్ విపుల్ ఎం. పంచోలిలతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌పై విచారణ జరిపింది. ఈ ఏడాది జనవరి 28న కేంద్రం జారీ చేసిన నోటిఫికేషన్ కేవలం సలహా మాత్రమేనని, దాన్ని పాటించకపోతే శిక్షలు ఉంటాయని ఎక్కడా చెప్పలేదని ధర్మాసనం పేర్కొంది. "ఒకవేళ శిక్షార్హమైన చర్యలు తీసుకుంటే లేదా దీన్ని తప్పనిసరి చేస్తే అప్పుడు విచారిస్తాం. ప్రస్తుతానికి ఇందులో అలాంటివేమీ లేవు" అని కోర్టు వ్యాఖ్యానించింది.

పిటిషనర్ తరఫున వాదనలు వినిపించిన సీనియర్ న్యాయవాది సంజయ్ హెగ్డే, సర్క్యులర్‌లో శిక్షలు లేకపోయినా ఇది పరోక్ష ఒత్తిడికి దారితీస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. వందేమాతరం పాడటానికి లేదా గౌరవ సూచకంగా నిలబడటానికి నిరాకరించే వారు సామాజిక వివక్షను ఎదుర్కొనే ప్రమాదం ఉందని ఆయన వాదించారు. "దేశభక్తిని బలవంతంగా రుద్దలేరు. వ్యక్తిగత అంతరాత్మను కాపాడాల్సిన బాధ్యత రాజ్యాంగంపై ఉంది" అని ఆయన నివేదించారు.

అయితే, పిటిషనర్ వ్యక్తం చేస్తున్న ఆందోళనలు ప్రస్తుతానికి ఊహాజనితమేనని ధర్మాసనం అభిప్రాయపడింది. ఒకవేళ ఎవరిపైనైనా శిక్షార్హమైన చర్యలు తీసుకున్నా లేదా వివక్ష చూపినా, అప్పుడు మళ్లీ కోర్టును ఆశ్రయించవచ్చని సూచిస్తూ పిటిషన్‌ను కొట్టివేసింది. విద్యాసంస్థలు, బహిరంగ సభల్లో వందేమాతరం పాడాలని కేంద్రం సర్క్యులర్‌లో సూచించింది. ఇది కేవలం జాతీయ గేయంపై గౌరవాన్ని పెంపొందించడానికేనని,

చట్టబద్ధంగా అమలు చేయాలనే ఉద్దేశం లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది.వందేమాతరం స్ఫూర్తి గురించి ఇటీవల ప్రధాని నరేంద్ర మోదీ లోక్‌సభలో ప్రస్తావించడం గమనార్హం. బంకించంద్ర చటోపాధ్యాయ 1875లో రచించిన ఈ గేయం, స్వాతంత్ర్య పోరాటంలో ప్రజలను ఏకతాటిపై నడిపించిందని కొనియాడారు. రవీంద్రనాథ్ ఠాగూర్ స్వరపరిచిన ఈ గీతాన్ని 1896లో కాంగ్రెస్ సమావేశంలో తొలిసారి ఆలపించారు. 1950లో అప్పటి రాష్ట్రపతి బాబూ రాజేంద్రప్రసాద్ దీనికి జాతీయ గేయం హోదా కల్పించారు.

## ఇరాన్‌పై 15,000 బాంబులు వేశాం... 3 వేల లక్ష్యాలపై దాడులు

- మొదటి పేజీ తరువాయి

ఇరాన్‌లోని 3,000 లక్ష్యాలపై దాడులు చేసినట్లు తెలిపారు.అయితే ఇరాన్‌పై దాడిని ఐదు రోజుల పాటు నిలిపివేస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రెండు రోజుల క్రితం సంచలన ప్రకటన చేశారు. ఈ ప్రకటనతో తమకు సంబంధం లేదని ఇజ్రాయెల్ చెబుతోంది.

## చంద్రబాబుకు భయపడొద్దు..

- మొదటి పేజీ తరువాయి

చేశారు. గూగుల్ విషయంలోనూ ఇదే జరిగిందని, మాటలు కోటలు దాటుతున్నా చేతల్లో ఏమీ లేదని విమర్శించారు. రాబోయే రోజుల్లో పార్టీని సరికొత్తగా తీర్చిదిద్దుతామని, 'జగన్ 2.0'లో కార్యకర్తలకు అత్యంత ప్రాధాన్యత ఉంటుందని హామీ ఇచ్చారు. నేతలెవరూ చంద్రబాబును చూసి భయపడాల్సిన అవసరం లేదని, ఆ రోజులు పోయాయని ధైర్యం చెప్పారు.నియోజకవర్గాల పునర్విభజన జరగబోతుండటం పార్టీకి మంచి పరిణామమని జగన్ అభిప్రాయపడ్డారు. దీనివల్ల మహిళా రిజర్వేషన్లు అమల్లోకి వస్తాయని, గతంలో తాము పదవులు, కాంట్రాక్టుల్లో మహిళలకు ప్రాధాన్యత ఇచ్చామని, ఇప్పుడు చట్టసభల్లో కూడా మన మహిళలకు మరిన్ని అవకాశాలు వస్తాయని పేర్కొన్నారు.

## భాగ్యనగరంలో ప్రయాణికులకు ఆర్టీసీ శుభవార్త

భాగ్యనగరంలో ప్రయాణికులకు టీజీఎస్‌ఆర్టీసీ శుభవార్త చెప్పింది. హైదరాబాద్ నగర పరిధిలోని మెట్రో, ఏసీ డీలక్స్ బస్సుల్లో 30 శాతం రాయితీ ఇవ్వనున్నట్లు ప్రకటించింది. పెట్రోల్, డీజిల్ కొరత వార్తల నేపథ్యంలో ప్రయాణికులకు ఆర్టీసీ ఊరటనిచ్చే వార్త చెప్పింది.

ఈ సందర్భంగా ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి స్పందిస్తూ, "పెట్రోల్ కష్టాలు పడటం ఎందుకు దండగ, ఆర్టీసీ బస్సులు ఉండగ" అంటూ వ్యాఖ్యానించారు. పెట్రోల్ బంకుల వద్ద ప్రజలు బారులు తీరవద్దని, సురక్షితంగా బస్సులోనే ప్రయాణించాలని సూచించారు.

## అమెరికా విమాన వాహకనౌక లక్ష్యంగా క్షిపణి దాడులు చేశాం

ఇరాన్‌పై దాడులను ఐదు రోజుల పాటు నిలిపివేస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ప్రకటించిన రెండు రోజుల అనంతరం, అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. అగ్రరాజ్యం అమెరికాకు చెందిన విమాన వాహక నౌక యూఎస్ఎస్ అబ్రహం లింకన్ లక్ష్యంగా ఇరాన్ క్రూయిజ్ క్షిపణితో దాడులు చేసింది. ఈ మేరకు ఇరాన్ ప్రభుత్వం ప్రకటన చేసింది. యూఎస్ఎస్ అబ్రహం లింకన్ విమాన వాహక నౌక వైపు తాము క్రూయిజ్ క్షిపణిని ప్రయోగించామని ఇరాన్ ప్రభుత్వ టెలివిజన్ ప్రసారం చేసింది. దీనిని అమెరికా ధృవీకరించవలసి ఉంది.ఈ విమాన వాహక నౌక కదలికలను నిరంతరం పరిశీలిస్తున్నామని, దానిని లక్ష్యంగా చేసుకుంటామని ఇరాన్ హెచ్చరించింది. ఆ తర్వాత గంటలోపు క్షిపణి దాడి జరగడం గమనార్హం. ఇందుకు సంబంధించిన వీడియోను ఇరాన్ మీడియా విడుదల చేసింది. అబ్రహం లింకన్‌పై దాడి చేశామని ఇరాన్ ఇదివరకు కూడా ప్రకటించింది. తమ బాలిస్టిక్ క్షిపణులు ఈ నౌకను ఢీకొట్టాయని, దీనితో అది పని చేయడం లేదని, గల్ఫ్ జలాల నుంచి వెనక్కి తగ్గిందని ఇటీవల ఇరాన్ ప్రకటించగా, అమెరికా తోసిపుచ్చింది.

## ఇండియన్ కలినరీ ఇనిస్టిట్యూట్‌తో ఏపీ పర్యాటక శాఖ ఎంఓయూ

- మొదటి పేజీ తరువాయి

చంద్రబాబునాయుడు సమక్షంలో ఈ కీలకమైన ఎంఓయూ కుదిరింది. ఇండియన్ కలినరీ ఇనిస్టిట్యూట్ ప్రతినిధులు-ఏపీ పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్‌లు ముఖ్యమంత్రి సమక్షంలో ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు.తెలుగు రుచులను, వంటకాలను ప్రపంచానికి పరిచయం చేయటంతో పాటు ప్రాంతీయ ఆహార సంస్కృతిని చాటి చెప్పేలా ఇండియన్ కలినరీ ఇనిస్టిట్యూట్ సహకారం అందించనుంది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఆంధ్రప్రదేశ్‌ను కలినరీ టూరిజానికి ఓ కీలకమైన ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు వీలుగా ఈ ఎంఓయూ తోడ్పడనుంది. ప్రత్యేకించి కలినరీ విభాగంలో నైపుణ్యాభివృద్ధి కల్పన, ఉపాధి, ఉద్యోగ అవకాశాలు, ఆంధ్రప్రదేశ్ టూరిజం అథారిటీ నిర్వహించే ఫుడ్ ఫెస్టివల్స్, టూరిజం ఈవెంట్లను నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా తెలుగు వంటకాల రుచులను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తెలియచేసేలా కార్యాచరణ చేపట్టనున్నారు. ఈ అవగాహనా ఒప్పందం కార్యక్రమంలో పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ, ఏపీ హోటల్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# సీహెచ్సి సూపరిండెంట్ కు ఘన వీడ్కోలు

పెన్ పవర్
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం। మన్యం। విజయనగరం। విశాఖపట్నం । అనకాపల్లి। అల్లూరి జిల్లా

**ఉన్నత విద్యాభ్యాసానికి వెళ్తున్నా డాక్టర్ వివేక్.**



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, మార్చి 25.** మండల కేంద్రంలో గల సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరిండెంట్ డాక్టర్ వివేక్ ఉన్నత విద్యాభ్యాసానికి వెళుతున్న సందర్భంలో స్థానిక వైద్య సిబ్బంది వీడ్కోలు సభ బుధవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి ధరణి మాట్లాడుతూ.. స్థానిక సిహెచ్ లో వైద్య అధికారి వివేక్ అందుబాటులో ఉంటూ రోగులకు ప్రత్యేక వైద్య సేవలు అందించే వారిని ఉన్నత చదువుపై వెళ్ళుతుండడంతో ఆయన లోటు తీర్చలేమని ఆమె అన్నారు. అనంతరం వివేక్ దంపతులకు దుశ్శాలువతో ఘనంగా సత్కరించి జ్ఞాపిక అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## చెట్టుపల్లిలో శ్రీరామనవమి వేడుకలు ప్రారంభం



**నర్సీపట్నం, పెన్ పవర్ (మార్చి 25)** :నర్సీపట్నం మండలం చెట్టుపల్లిలో ఈరోజు ఘనంగా శ్రీరాముని పెళ్లి రాట వేయడం జరిగిందని గ్రామ పెద్దలు తెలియజేశారు. ఈ కార్యక్రమం ఉద్దేశించి గ్రామ పెద్దలు మాట్లాడుతూ శ్రీరామనవమి సందర్భంగా చెట్టుపల్లి గ్రామంలో నూతన దంపతులు చేతుల మీదుగా ప్రతి సంవత్సరం పూజా కార్యక్రమాలు, శ్రీరాముని కల్యాణోత్సవం, తదుపరి శ్రీరామనవమి రోజు మహా అన్నసంతర్పణ కార్యక్రమం జరుగుతుందని అన్నారు. అదే రోజు సాయంత్రం సీతా, రాముల ఉత్సవమూర్తులను పురవీధులలో ఊరేగింపు కార్యక్రమం ఉంటుందని, ఈ బృహత్తర కార్యక్రమానికి చెట్టుపల్లి రామాలయం యూత్ సభ్యులు గ్రామ పెద్దల పర్యవేక్షణలో గ్రామ ప్రజల సహకారంతో శ్రీరామనవమి వేడుక జరుగుతుందని తెలియజేశారు. శ్రీరామనవమికి సంబంధించి పనులు ఈరోజు నుంచి ప్రారంభమవుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన విశాఖ రూరల్ జిల్లా ఉపాధ్యక్షుడు ఊడి చక్రవర్తి, గ్రామ సర్పంచ్ నాగరత్నం, సూరిబాబు, వైస్ ఎంపీపీ రత్నం రమణ, జనసేన సీనియర్ నాయకులు మోపాడ సత్య ప్రసాద్, స్కూల్ కమిటీ చైర్మన్ పచ్చికారి ఈశ్వరరావు, వడ్డీ శ్రీను, గ్రామ టిడిపి అధ్యక్షులు కలిమి సత్తిబాబు, ఆచారి, , పండూరి నర్సింగరావు, కలిమి శేఖర్, ములకపాక నానాజీ, సేనాపతి నాగేశ్వరరావు, వనం తుంబర నారాయణమూర్తి, గజాల నానాజీ, భీమరాజు, శ్రీరామ యూత్ సంఘ సభ్యులు, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

# జి మాడుగుల మండలం సొలభం పంచాయతీ సర్పంచ్ ఐసరం హనుమంతరావు అద్వర్యలో ఆదివాసి సత్యాగ్రహ యాత్ర.

**జిమాడుగుల పెన్ పవర్ మార్చి 25**

షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యో నియమకాల చట్టం బద్ధం చేయాలని ఏప్రిల్ 3 న పాడేరులో జరిగే ఆదివాసీ సత్య గ్రహ యాత్ర భారీ ర్యాలీని జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ జెఏసి అల్లూరి సీతరామరాజు జిల్లా చైర్మన్ రామరావుదొర పిలుపునిచ్చారు.

సొలభం గ్రామం నుంచి ఆదివాసి సత్యాగ్రహ యాత్రను సొలభం పంచాయతీ సర్పంచ్ ఐసరం హనుమంతరావు అధ్యక్షతన యాత్రను ఆంధ్రప్రదేశ్ ఆదివాసి జేఏసీ ప్రారంభించింది. ఈ కార్యక్రమంలో రామరావుదొర మాట్లాడుతూ సత్య గ్రహయాత్ర ఈ రోజుతో 136వ రోజుకు చేరుకుందని, రాష్ట్రంలో అనేక గ్రామాలను పర్యటిస్తూ, షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగాల నియామకల చట్టం చేయాలని ప్రభుత్వానికి డిమాండ్ చేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదివాసి నిరుద్యోగులకు న్యాయం చేయడం కోసం ఆదివాసి ప్రాంత ఉద్యోగాలన్నీ స్థానిక ఆదివాసీలకే కల్పించేలా చట్టం చేస్తామని పలు సందర్భాల్లో ఆదివాసి ప్రాంతాల పర్యటన లో హామీ ఇచ్చి ఇప్పుడు మరిచిపోయారన్నారు. 2025 ఆగస్టు 9 న పాడేరు లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వచ్చినప్పుడు ఈ చట్టం చేస్తామని ఆదివాసి జేఏసీకి ఆదివాసులకు హామీ ఇచ్చారన్నారు. షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగాల నియామక చట్టం చేసేంతవరకు ఆదివాసులందరూ ఉద్యమాలు చేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలియజేశారు.

ఈ చట్టం చేయడం ఆదివాసులకు చారిత్రక అవసరమే కాదు కూటమి ప్రభుత్వం యొక్క గురుతర బాధ్యత కూడా అని రామారావు దొర అన్నారు. అలాగే ఏజెన్సీ చట్టాలు రాజ్యాంగ పరిధులు పరిగణలోకి తీసుకొని షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగాల నియామక చట్టం కూర్పు లో స్టేట్ కేడర్ పోస్టులలో 30శాతం, జోనల్ కేడర్ పోస్టులలో 50శాతం, లోకల్ కేడర్ పోస్టులన్నిటిని స్థానిక ఆదివాసీలతో భర్తీ చేసే విధంగా సమగ్రమైన చట్టం చేయాలని పలుదఫాలుగా ప్రభుత్వం తో జరిపిన చర్చలలో ఆదివాసి జేఏసీ స్పష్టం చేసింది, ఇప్పటికైనా షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగాల నియామక చట్టం చేయకపోతే, గౌరవ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రకటించిన మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ద్వారా మరో మారు ఆదివాసులకు తీవ్ర అన్యాయం జరగనుందని ఆదివాసి జేఏసీ హెచ్చరిస్తుంది. కావున కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చకుంటే , షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగాల నియామక చట్టం చేయకపోతే ఆదివాసి జేఏసీ ఉద్యమాలు తీవ్రతరం చేసి ప్రభుత్వనికి డిమాండ్ చేస్తామని హెచ్చరించారు. ఆదివాసీ జెఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ మొట్టడం రాజబాబు మాట్లాడుతూ జిఓ నెంబర్ 3 రద్దు చేయడంతో ఆదివాసీలకు తీవ్ర నష్టం జరిగిందని, గిరిజన సలహా మండలి (టిఎసి)ద్వారా షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగ నియామకాల చట్టం చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీ చట్టాలైనా భూబదాలయింపు నిషేధ చట్టం,పెసా చట్టం, అటవీ హక్కుల చట్టం, ఎస్సి,ఎస్టీ అట్రాసిటీ చట్టాలను సక్రమంగా అమలు చేయవలసిన బాధ్యత ప్రభుత్వానిదేనని డిమాండ్ చేసారు.



ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఆదివాసి జేఏసీ నాయకులు పార్థు, స్వామి, గంగరాజు, జేఏసీ మీడియా ప్రతినిధి మరియు గిరిజన విద్యార్థి సంఘం డివిజన్ అధ్యక్షుడు మణుగూరు బాబుజీ, పార్థసారథి, మరియు గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అన్ని గ్రామాలకు ఆదివాసి సత్యాగ్రహ యాత్ర రథం వెళ్లి ఏప్రిల్ 3 వ తారీకున పాడేరులో జరిగే ర్యాలీ విజయవంతం చేయాలని ప్రచారం చేసారు.

# శ్రీ శ్రీ వైభవ వెంకటేశ్వర స్వామి దేవస్థానం నుంచి భద్రాచలం సీతారాముల కల్యాణానికి ప్రత్యేక కానుకలు





**మురళినగర్, మార్చి 25 (పెన్ పవర్):** విశాఖపట్నం నగరంలోని కప్పురాడలో ఉన్న శ్రీ వైభవ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం నుంచి భద్రాచలం శ్రీ సీతారాముల వారి కళ్యాణ మహోత్సవానికి విశేషమైన కానుకలను పంపించారు. కలియుగ ప్రత్యక్ష దైవంగా భక్తుల విశ్వాసాన్ని పొందిన స్వామివారి సన్నిధి నుంచి ఈ కార్యక్రమం భక్తిశ్రద్ధల మధ్య జరిగింది.

ఈ సందర్భంగా స్వామివారికి ముత్యాల గజమాల, సీతా అమ్మవారికి జడపాల మరియు కిరీటాన్ని ప్రత్యేకంగా తయారు చేసి భద్రాచలానికి పంపించారు. ఈ కార్యక్రమాన్ని శ్రీ వైభవ వెంకటేశ్వర స్వామి దేవస్థానం మరియు వనమాలి భక్త బృందం సంయుక్తంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో కార్యనిర్మాణ అధికారి బండారు ప్రసాద్, ఆలయ అర్చకులు గోపీనంబాల వాసుదేవాచార్యులు, గోపీనంబాల శేషాచార్యులు, చరణ్ స్వామి పాల్గొన్నారు. కార్యనిర్వహణ అధికారి బండారు ప్రసాద్ ప్రత్యక్ష పర్యవేక్షణలో కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది.

## గోపాలపట్నంలో అక్రమంగా నిల్వ చేసిన పటాకులు స్వాధీనం





**ఇద్దరిపై కేసులు నమోదు చేసిన పోలీసులు**

**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, మార్చి 25 :** గత దీపావళి సందర్భంగా లైసెన్స్ తీసుకుని పటాకుల విక్రయాలు నిర్వహించిన దుకాణదారులకు, అమ్మకాలు పూర్తయ్యాక మిగిలిన ఫైర్ క్రాకర్స్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ ఇళ్లలో గాని, దుకాణాల్లో గాని లేదా ఇతర ప్రదేశాల్లో నిల్వ ఉంచరాదని పోలీసుల తరఫున ముందుగానే అవగాహన కల్పించారు. ఈ మేరకు ప్రత్యేక సమావేశం నిర్వహించి చట్టపరమైన నిబంధనలను స్పష్టంగా వివరించారు. అయితే, కొంతమంది వ్యాపారుల్లో మార్పు కనిపించకపోవడంతో, మానవ ప్రాణాలకు ప్రమాదం కలిగించే విధంగా అక్రమంగా పటాకులను నిల్వ ఉంచుతున్నారని సమాచారం అందడంతో పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈరోజు గోపాలపట్నం సర్కిల్ ఇన్స్పెక్టర్, ఎస్సై రామారావు సిబ్బంది మరియు మహిళా పోలీసులతో కలిసి పలు దుకాణదారుల ఇళ్లలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మారిశెట్టి మురళి భాస్కరరావు అనే వ్యక్తి వద్ద సుమారు రూ.84,000 విలువైన పటాకులు, అలాగే ప్రసాద్ రెడ్డి అనే మరో వ్యక్తి వద్ద సుమారు రూ.3,000 విలువైన పటాకులు అక్రమంగా నిల్వ ఉంచినట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ ఇద్దరు వ్యక్తులపై సంబంధిత చట్టాల ప్రకారం కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు ప్రజలకు హెచ్చరిక జారీ చేస్తూ, ఎటువంటి అనుమతులు లేకుండా ఫైర్ క్రాకర్స్ తయారు చేయడం, నిల్వ ఉంచడం లేదా వినియోగించడం చట్టరీత్యా నేరమని, ఇటువంటి చర్యలు చేపడితే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# పాడేరు సర్వజన ఆసుపత్రికి ఆకస్మిక తనిఖీ




**రోగుల సమస్యలు తెలుసుకున్న కలెక్టర్**

**స్టాఫ్ రిపోర్టర్,పాడేరు,పెన్ పవర్, మార్చి 25:** పాడేరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ ఎ.ఎస్. దినేష్ కుమార్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని ఓపీ విభాగంతో పాటు వివిధ వార్డులను క్షుణ్ణంగా పరిశీలించి, రోగులకు అందుతున్న వైద్య సేవలపై నేరుగా ఆరా తీశారు. వార్డుల్లో చికిత్స పొందుతున్న రోగులతో కలెక్టర్ మాట్లాడారు. వంటలమామిడి పంచాయతీ ఒంటిపాక గ్రామానికి చెందిన మలేరియా జ్వరంతో బాధపడుతున్న బాలిక కిల్లో తలసను, పెద్దలోచలి గ్రామానికి చెందిన మానసిక రుగ్మతతో బాధపడుతున్న కిడారి ప్రణీత్‌ను, అలాగే కాలు గాయంతో చికిత్స పొందుతున్న అల్లంగి రాంబాబును కలిసి వారి ఆరోగ్య పరిస్థితి, అందుతున్న వైద్య చికిత్స, మందుల పంపిణీ, వైద్యుల అందుబాటుపై వివరాలు తెలుసుకున్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులు ఓపీ నమోదు కోసం గంటల తరబడి వేచి ఉండకుండా 'అభా యాప్' ద్వారా డిజిటల్‌గా నమోదు చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. దీని వల్ల సమయం ఆదా అవుతుందని, రోగుల ఆరోగ్య వివరాలు భద్రంగా నిల్వ ఉంటాయని తెలిపారు. ఆసుపత్రిలో నిరుపేద రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, ప్రాంగణంలో మంచినీటి సౌకర్యం, మరుగుదొడ్ల వినియోగం, పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. శ్రీనివాసరావు, డాక్టర్ ఎర్రయ్య తదితర వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



## మండు వేసవిలోనూ అరగడపల్లిలో హిమ సోయగాలు





**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, మార్చి 25:** అల్లూర జిల్లాలోని ప్రకృతి అందాలు మరోసారి ఆకట్టుకుంటున్నాయి.మండు వేసవిలోనూ ఇక్కడ మంచు మేఘాలు అలరిస్తుండటం విశేషం. జీకే వీధి మండలం వంచుల పంచాయతీ అరగడపల్లి గ్రామంలో బుధవారం ఉదయం సూర్యోదయం అయినా, 10 గంటల దాటినా మంచు తొలగకపోవడం స్థానికులను ఆశ్చర్యానికి గురిచేసింది. పచ్చని కొండల మధ్య శ్వేత వర్ణంలో మెరిసే మంచు మేఘాలు పాలకడలిని తలపిస్తున్నాయి. కాలాలతో సంబంధం లేకుండా ప్రకృతి సోయగాలు ఇక్కడ ప్రత్యేకంగా నిలుస్తున్నాయి.

## పది తరగతి పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన తహసిల్దార్



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, మార్చి 25** ,జీకేవీధి మండలంలో జరుగుతున్న పదవ తరగతి పరీక్షలను తహసీల్దార్ హెచ్. అన్నాజీరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన 'ఏ', 'బి' పరీక్షా కేంద్రాలను ఆయన పరిశీలించారు.పరీక్ష నిర్వహణ తీరును సమీక్షించిన తహసీల్దార్, విద్యార్థులకు కల్పించిన సౌకర్యాలపై వివరాలు తెలుసుకున్నారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరుగుతున్నాయా లేదా అన్న విషయాన్ని ప్రత్యేకంగా గమనించారు. ఈ సందర్భంగా మాస్ కాపీయింగ్‌కు ఎలాంటి అవకాశం ఇవ్వకూడదని సూచించారు. ఎవరైనా నిర్లక్ష్యం ప్రదర్శిస్తే సంబంధిత ఇన్విజిలేటర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.పరీక్షలు పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ ఆదేశించారు.

## జీకే వీధిలో శ్రీరామ నవమి ఉత్సవాల సందడి ప్రారంభం



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, మార్చి 25:** మండలంలోని జీకే వీధిలో శ్రీ రామ నవమి ఉత్సవాల సందడి ప్రారంభమైంది. ఈ నెల 27 జరిగే వేడుకలకు ఏర్పాట్లు జోరుగా కొనసాగుతున్నాయి. అదే రోజు సీతారాముల కళ్యాణాన్ని ఘనంగా నిర్వహించనున్నారు.ఇందుకోసం బుధవారం ఉత్సవ పందిరి రాట కార్యక్రమం భక్తిశ్రద్ధలతో జరిగింది. మహిళలు, గిరిజనులు పూజలు చేసి వేడుకలకు శ్రీకారం చుట్టారు. 27న ఉత్సవమూర్తుల ఊరేగింపు, కళ్యాణం వైభవంగా జరగనుంది. ఈ కార్యక్రమంలో అరకు పార్లమెంట్ జనసేన పార్టీ ఎగ్జిక్యూటివ్ మెంబెర్ గొర్లె వీర వెంకట్, బీజేపీ నాయకులు రిమెల పాల్, ఎంపీటీసీ రాజేశ్వరి,టీడీపీ నాయకులు ముక్కలి రమేష్, గ్రామ పెద్దలు వెంకట రావు, సురకత్తి లక్ష్మణ్ బాబు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## చింతపల్లి నియోజకవర్గ పునరుద్ధరణపై ఆశలు



**(స్టాఫ్ రిపోర్టర్ మాదిరి చంటిబాబు)గూడెం కొత్త వీధి, పెన్ పవర్, మార్చి 25:**గతంలో ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో ప్రత్యేక గుర్తింపు పొందిన చింతపల్లి శాసనసభ నియోజకవర్గం మళ్లీ పునరుద్ధరించాలన్న ఆశలు స్థానిక ప్రజల్లో మళ్లీ చిగురిస్తున్నాయి. అప్పట్లో చింతపల్లి, జీకేవీధి, కొయ్యూరు మండలాలతో పాటు నాతవరం, గొలుగొండలలోని గిరిజన గ్రామాలు ఈ నియోజకవర్గ పరిధిలో ఉండేవి.కాలక్రమేణా జరిగిన నియోజకవర్గాల పునర్విభజనలో చింతపల్లి నియోజకవర్గం రద్దై, ప్రస్తుతం పాడేరు నియోజకవర్గంలో విలీనమైంది. దీంతో గిరిజన ప్రాంతాల ప్రత్యేక అవసరాలు, సమస్యలు తగిన స్థాయిలో వినిపించడం లేదన్న అభిప్రాయం స్థానికుల్లో ఉంది.చింతపల్లి శాసనసభ నియోజకవర్గం 1978లో ఏర్పడి, 2008లో రద్దయింది. ఇది విశాఖపట్నం జిల్లాలో గిరిజన ప్రాంతాలను కవర్ చేసేది.ఇప్పుడు మళ్లీ శాసనసభ నియోజకవర్గాల పునర్విభజనపై చర్చలు కొనసాగుతున్న నేపథ్యంలో, చింతపల్లి నియోజకవర్గం తిరిగి ఏర్పాటు కావాలన్న డిమాండ్ బలపడుతోంది. గిరిజన గ్రామాల అభివృద్ధికి, ప్రజల సమస్యలకు ప్రత్యేక ప్రాతినిధ్యం అవసరమని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. చింతపల్లి నియోజకవర్గం పునరుద్ధరణ జరిగితే, ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధి మరింత వేగవంతం అవుతుందని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# చీపురుపల్లిలో ఘనంగా రామ్ మల్లిక్ నాయుడు జన్మదిన వేడుకలు





**చీపురుపల్లి పెన్ పవర్ మార్చి 25..**
పార్టీ కార్యాలయం నుంచి కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు.
అమ్మవారి సన్నిధిలో రామ్ మల్లిక్ నాయుడు పేరుతో ప్రత్యేక అర్చనలు నిర్వహించారు.
ఆలయం నుంచి మూడు రోడ్ల జంక్షన్ వరకు వందలాది బైకులతో భారీ ప్రదర్శన చేపట్టారు.
సామాజిక బాధ్యతగా చీపురుపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్ల పంపిణీ చేశారు.
ముక్కోణపు జంక్షన్ వద్ద మరియు పార్టీ కార్యాలయంలో కార్యకర్తల మధ్య కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహించారు.
నాలుగు మండలాల ముఖ్య నాయకులు హాజరై, భారీ ఎత్తున అభిమానులు తరలివచ్చారు.
చీపురుపల్లి నియోజకవర్గంలో రామ్ మల్లిక్ నాయుడు గారి జన్మదిన వేడుకలు పార్టీ శ్రేణులు, అభిమానుల మధ్య అత్యంత కోలాహలంగా జరిగాయి. నాలుగు మండలాల నుంచి తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు, అభిమానుల సమక్షంలో ఈ కార్యక్రమం వైభవంగా నిర్వహించబడింది.
ముందుగా పార్టీ కార్యాలయం నుంచి బయలుదేరిన శ్రేణులు స్థానిక కనకమహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకున్నారు. అక్కడ రామ్ మల్లిక్ నాయుడు గారి పేరుతో ప్రత్యేక అర్చనలు నిర్వహించి, ఆయన ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ప్రార్థనలు చేశారు. అనంతరం ఆలయం నుంచి మూడు రోడ్ల జంక్షన్ వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. వందలాది బైకులతో అభిమానులు చేసిన నినాదాలతో చీపురుపల్లి వీధులు మారుమోగాయి.
ఈ సందర్భంగా సేవా కార్యక్రమాల్లో భాగంగా చీపురుపల్లి ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి, అక్కడ చికిత్స పొందుతున్న రోగులకు పండ్లను పంపిణీ చేశారు. నాయకులు, అభిమానులు చేసిన ఈ సేవా కార్యక్రమం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.
అనంతరం మూడు రోడ్ల జంక్షన్ వద్ద అభిమానుల మధ్య కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. చివరగా పార్టీ కార్యాలయానికి చేరుకున్న నాయకులు, కార్యకర్తలు అక్కడ మరోసారి కేక్ కట్ చేసి తమ అభిమాన నాయకుడికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ వేడుకల్లో నియోజకవర్గంలోని నాలుగు మండలాల ముఖ్య నాయకులు, భారీ సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఆన్-లైన్ బెట్టింగు యాపులతో మరియు ఆఫ్-లైన్ బెట్టింగుతో జీవితాలను నాశనం చేసుకోవద్దు

* జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్.




**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, విజయనగరం. మార్చి 25 :** ఆన్-లైన్ బెట్టింగు యాపులతో మరియు ఆఫ్-లైన్ బెట్టింగుతో జీవితాలను నాశనం చేసుకోవద్దని యువతకు జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ పిలుపునిచ్చారు. ఈ నెల 28 నుండి ఐపిఎల్ క్రికెట్ మ్యాచ్ లు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆన్-లైన్, ఆఫ్-లైన్ క్రికెట్ బెట్టింగులకు పాల్పడేవారు, ముఖ్యంగా యువత అప్రమత్తంగా ఉండాలని, ఆర్థికంగా జీవితాలను నాశనం చేసే బెట్టింగుల జోలికి పోవద్దని ప్రజలు, యువతను జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ హెచ్చరించారు.

బెట్టింగు యాపుల వినియోగం వలన ఆర్థికంగా ఎక్కువగా నష్టం కలిగిస్తాయని, సాఫీగా సాగిపోతున్న జీవితాలను నాశనం చేస్తాయాని ఎస్పీ ఎఆర్ దామోదర్ అన్నారు. చిన్న మొత్తాలతో ప్రారంభించిన బెట్టింగులు, ఆశక్తి పెరిగే కొద్ది పెద్ద మొత్తంలో డబ్బులను బెట్టింగుకు పెట్టి, చివరకు ఆర్థికంగా పెద్ద మొత్తంలో నష్టపోతారన్నారు. బెట్టింగుల్లో ఎదురైన ఓటముల వలన నష్టాన్ని అధిగమించేందుకు మరింత ఎక్కువ పెట్టుబడులు పెట్టడం మరియు మరిన్ని అప్పులు చేయాల్సి వస్తుందన్నారు. బెట్టింగు యాపులను ప్రారంభంలో సరదాగా వినియోగించి, చివరకు అదే వ్యసనంగా మారే పరిస్థితులకు చేరుకొంటారన్నారు. ఒకసారి బెట్టింగులకు అలవాటు పడిన వ్యక్తులు తమ ఆలోచనలన్నీ బెట్టింగు మీదనే పెట్టి, ఆర్థిక నష్టాలతో చివరకు కుటుంబ సభ్యులతో గొడవలకు దారితీస్తుందని జిల్లా ఎస్పీ తెలిపారు. బెట్టింగులకు అలవాటుపడిన వ్యక్తులు కుటుంబ అవసరాలను నిర్లక్ష్యం చేస్తూ, సంపాదనంతా బెట్టింగుల్లోనే పోగొట్టుకొనే ప్రమాదం కూడా ఉందన్నారు. బెట్టింగులతో డబ్బులను పోగొట్టుకొని మానసిక ఒత్తిడికి గురవుతారని, నిరాశ, ఆత్మన్యూనత భావాలతో చివరికి ఆత్మహత్యా ప్రయత్నాలకు దారితీస్తాయన్నారు. బెట్టింగులతో నిత్యం సమయాన్ని గడపడం వలన కుటుంబ సభ్యులు, స్నేహితులకు దూరం కావడమే కాకుండా, విలువైన సమయాన్ని వృధా చేస్తూ, అభివృద్ధికి దూరమవుతారని ప్రజలను జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ హెచ్చరించారు.
ఈ తరహా బెట్టింగు యాపులను వినియోగించడం, ఆఫ్-లైన్ బెట్టింగులకు పాల్పడడం చట్ట విరుద్ధమని, ఎవరైనా బెట్టింగులకు పాల్పడి పట్టుబడితే చట్టపరమైన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ హెచ్చరించారు. ఈ తరహా కేసుల్లో నిందితులకు జైలు శిక్షలు, పెద్ద మొత్తంలో జరిమానాలు తప్పవన్నారు. కావున, ప్రజలు, ముఖ్యంగా యువత తమ జీవితాలను నాశనం చేసే బెట్టింగు యాపుల జోలికి పోవద్దన్నారు. బెట్టింగులతో డబ్బులు సంపాదించవచ్చు అనే అత్యాశతో బెట్టింగులకు పాల్పడే కంటే ఆర్థిక భద్రత కోసం కష్టపడి పని చేయడం, న్యాయబద్ధంగా సంపాదించిన నగదును సద్వినియోగం చేసుకోవడం ఉత్తమమైన మార్గమని ప్రజలకు జిల్లా ఎస్పీ సూచించారు. ఆన్-లైన్ లేదా ఆఫ్-లైన్ బెట్టింగులకు పాల్పడేవారి సమాచారాన్ని డయల్ 112/100 లేదా స్థానిక పోలీస్ స్టేషనుకు సమాచారం అందించాలని ప్రజలను జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ కోరారు.

# బీచ్‌లో డ్రగ్స్ వ్యతిరేకంగా 5కె రన్ పోస్టర్ ఆవిష్కరణ




**విశాఖ దక్షిణం, పెన్ పవర్, మార్చి 25 :**ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో మాదకద్ర వ్యాల నిర్మూలనకు అవగాహన కల్పించేందుకు బీచ్‌లో నిర్వహించనున్న 5కె రన్‌కు సంబంధించిన పోస్టర్‌ను ఘనంగా ఆవిష్కరించారు. ఈ పోస్టర్‌ను జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ విడు దల చేశారు. మార్చి 29న జరగనున్న ఈ 5కె రన్‌లో తాను ముఖ్య అతిథిగా పాల్గొంటానని ఆయన తెలిపారు.ఈ సందర్భంగా నిర్వాహకులు ప్రజలు, ముఖ్యంగా యువత పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఎస్ఎఫ్ఐ, డివైఎ ఫ్ఐ నాయకులు మాట్లాడుతూ రోజురోజుకు పెరుగుతున్న డ్రగ్స్, గంజాయి వినియోగం సమా జానికి తీవ్ర ప్రమాదమని ఆందోళన వ్యక్తం చేశా రు. జిల్లాలో గంజాయి మాఫియాను అరికట్టేం దుకు కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.యువతను లక్ష్యంగా చేసుకు ని మాదకద్రవ్యాల రవాణా పెరుగుతుందని, వాటి వల్ల జీవితాలు నాశనం అవుతున్నాయని పేర్కొన్నారు. డ్రగ్స్, గంజాయి అలవాట్లు వ్యక్తి గత ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తాయని, ఆర్థిక సమస్యలు మరియు అనారోగ్యానికి దారితీ స్తాయని హెచ్చరించారు.యువతకు సరైన ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించడమే ఈ సమస్యకు దీర్ఘకాలిక పరిష్కారమని అభిప్రా యపడ్డారు. సమాజాన్ని పట్టిపీడిస్తున్న ఈ సమస్యను అందరి సహకారంతో ఎదుర్కోవా లని పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు అజయ్, నాయకులు కుసుమాంజలి, నాయు డు, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాజు, కార్య దర్శి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## వ్యాపారాభివృద్ధితో సంపన్నకారి కావాలి..



**చీపురుపల్లి పెన్ పవర్ మార్చి 25 ..** వ్యాపార అభివృద్ధితో ప్రతి మహిళా సంపన్న కారి కావాలని మండల సమాఖ్య ఏపిఎం ఎన్ అప్పలనాయుడు అన్నారు. బుధవారం నాడుచీపురుపల్లి మండల సమాఖ్య కార్యాలయం లో "సంపన్నకారి" కార్యక్రమం పైన శిక్షణ కార్యక్రమం వి ఏ ఓల కు, సి ఆర్ పి లకు ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.
ఈ శిక్షణ కార్యక్రమంలో ఏపిఎం ఎన్ అప్పలనాయుడు మాట్లాడుతూ ఇప్పటికే స్వయం సహాయక సంఘ మహిళలు నిర్వహిస్తున్న వ్యాపార కార్యక్రమాలు ను, మరింతగా అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా వ్యాపార అభివృద్ధిని చేయడానికి సంబంధించి పలు సూచనలు చేశారు. సరిఅయిన మార్గదర్శనం, ఆర్థిక సహాయం, వ్యాపార శిక్షణలు మరియు మరిన్ని అవకాశాలు కల్పించడం కోసం రూపొందించబడిందే అన్నారు.. ఈ కార్యక్రమం ద్వారా గ్రామీణ మహిళా వ్యాపారాల అభివృద్ధికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రముఖ విద్యాసంస్థ ఐఐఎం విశాఖపట్నం కలిసి పనిచేస్తాయి అని ఆయన వివరించారు. ఈ కార్యక్రమం లో ఎం ఎం ఎస్ అధ్యక్షులు కే. దమయంతి, సీసీలు, వివో ఏ లు, సిఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

## మాతృ-శిశు మరణాల నివారణకు కట్టుదిట్టమైన చర్యలు



**గూడెం కొత్త,పెన్ పవర్,మార్చి 25:** అల్లూరి సీతారామరాజు జిల్లాలోని గూడెం కొత్త మండల ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం మండల పరిధిలోని వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్య సిబ్బందికి అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆర్.జె.పాలెం, యు.చీడిపాలెం, ఆర్.వి.నగర, జి.కె.వీధి, సప్పర్ల, దారకొండ, సీలేరు ప్రాంతాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సిబ్బంది హాజరయ్యారు.ఈ సందర్భంగా మాతృ మరియు శిశు సంరక్షణ కార్యక్రమంపై సమగ్ర అవగాహన కల్పించారు. ముఖ్యంగా మాతృ మరణాలు, శిశు మరణాలు జరగకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు, వ్యాధి నివారణ టీకాల ప్రాముఖ్యతపై వివరించారు. అలాగే 14 నుండి 15 సంవత్సరాల మధ్య వయస్సు గల ఆడపిల్లలకు హెచ్‌పీవీ వ్యాక్సిన్‌ను శాతం 100 పూర్తిచేయాలని సూచించారు. రిప్రొడక్టివ్ చైల్డ్ హెల్త్ (ఆర్‌సీహెచ్) పోర్టల్ నిర్వహణపై కూడా సిబ్బందికి మార్గదర్శకాలు ఇచ్చారు. అదేవిధంగా ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డులు (ఈహెచ్ఆర్) సంబంధిత లాగిన్‌లు పూర్తిగా నమోదు చేయాలని అధికారులుఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి పసుపులేటి నారాయణరావు, ఈహెచ్ఆర్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ పూజారి హరిప్రియ, జి.కె.వీధి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ ఎం. రుషశ్రీ, ఎస్.ఓ. జయంతి కైలాసరావు, డీపీఎచ్ఎన్ఓ జి. భూలోకమ్మ, డీపీఓ ఎస్. సతీష్, ఎంపీహెచ్(ఈ)ఓలు కె. వెంకటేశ్, ఎం. జాన్సన్, సీలేరు హెల్త్ సూపర్వైజర్ ఎన్. త్రినాధ్, దారకొండ పిహెచ్ఎన్ బత్తుల విక్టోరియా మహారాణి, హెల్త్ సూపర్వైజర్ ఎల్. రాజులమ్మ పాల్గొన్నారు.మండలంలోని వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఎంఎల్హెచ్‌పీలు, ఏఎన్ఎంలు ఈ సమావేశంలో పాల్గొని సూచనలు స్వీకరించారు.

# వందేళ్ల ఘనతకు కొత్త దిశ





### ఆంధ్ర విశ్వవిద్యాలయం స్నాతకోత్సవం వైభవంగా

**ఎ. యు, పెన్ పవర్, మార్చి 25 :**వందేళ్ల సుదీర్ఘ ప్రస్థానంతో విద్య, పరిశోధన రంగాల్లో విశిష్ట గుర్తింపు పొందిన ఆంధ్ర విశ్వ విద్యాలయం మరో కీలక మైలురాయిని చేరు కుంది. శతాబ్ది ఉత్సవాల నేపథ్యంలో నిర్వ హించిన 91వ, 92వ స్నాతకోత్సవాలు బుధవా రం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ఆం ధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్, విశ్వవిద్యాలయ ఛా న్సలర్ అబ్దుల్ నజీర్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు పట్టాలు, పురస్కారాలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ ఆంధ్ర విశ్వవిద్యాలయం వందేళ్ల ప్రయాణం దేశ విద్యా చరిత్రలో ఒక గొప్ప అధ్యాయమని కొని యాడారు. విద్య, పరిశోధన, ఆవిష్కరణల్లో విశ్వవిద్యాలయం సాధించిన ప్రగతి దేశానికి గర్వకారణమని పేర్కొన్నారు. వేలాది మంది విద్యార్థులను సమాజానికి అందించి వారు వివిధ రంగాల్లో ప్రతిభ చాటడం ఈ సంస్థ గొప్పతనానికి నిదర్శనమన్నారు. సర్ సి.ఆర్. రెడ్డి, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్, డాక్టర్ వి.ఎస్. కృష్ణ వంటి మహనీయుల దూరదృష్టి వల్లే ఈ స్థాయి సాధ్యమైందని గుర్తుచేశారు.

డిగ్రీతో కొత్త ప్రయాణం ప్రారంభం

విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ డిగ్రీ సాధన అంతిమ లక్ష్యం కాదని, అది కొత్త ప్ర యాణానికి ఆరంభమని గవర్నర్ సూచిం చారు. ఆత్మవిశ్వాసం, కష్టపడే తత్వం, నైతిక విలు వలతో ముందుకు సాగాలని హితవు పలికారు. సమాజానికి ఉపయోగపడే బాధ్యతాయుత పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు.

గౌరవ డాక్టరేట్లు, పరిశోధన పుర స్కారాలు

ఈ సందర్భంగా బ్యాంక్ ఆఫ్ అమెరికా వైస్ చైర్మన్, ఏయూ పూర్వ విద్యార్థి డాక్టర్ పూర్ణచం ద్రరావు సగ్గుర్తికి, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత తల్లావజ్జుల పతంజలి శాస్త్రికి గౌరవ డాక్టరేట్లు ప్రదానం చేశారు. అలాగే ప్రొ ఫెసర్లు పి. జగదీశ్వరరావు, సి.ఎన్.వి. సత్య నారాయణరెడ్డిలకు ఉత్తమ పరిశోధన అవా ర్డులు అందజేశారు. మొత్తం 17 మంది పరిశో ధకులకు మెడల్స్, 13 మందికి ప్రైజులు, 7 మందికి ఎం.ఫిల్ డిగ్రీలు, 441 మందికి పీహెచ్‌డీ పట్టాలు ప్రదానం చేశారు. యూజీ, పీజీ విభా గాల్లో 174 మెడల్స్, 437 ప్రైజులు విద్యార్థులు అందుకున్నారు.

భారత్ ఆర్థిక రంగంలో వేగంగా ఎదుగుతోంది

గౌరవ డాక్టరేట్ స్వీకరించిన అనంతరం డాక్టర్ పూర్ణచంద్రరావు సగ్గుర్తి మాట్లాడుతూ ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారత్ వేగంగా ఎదుగుతోంద న్నారు. రాబోయే కాలంలో ప్రపంచంలో మూ డవ అతిపెద్ద ఆర్థిక శక్తిగా అవతరించే అవకాశా లు ఉన్నాయని తెలిపారు. యువత తమ నైపు ణ్యాలను పెంపొందించుకుని ప్రపంచ అవకాశా లను అందిపుచ్చుకోవాలని సూచించారు.

విశాఖతో, ఆంధ్ర విశ్వవిద్యాలయంతో తనకు ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ "చేయ గలను అనే నమ్మకం"తో ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు.

ఎస్‌డీజీ లక్ష్యాల వైపు ఏయూ ముందుకు

విశ్వవిద్యాలయ ఉపకులపతి జి.పి. రాజశేఖర్ మాట్లాడుతూ సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధన లో ఆంధ్ర విశ్వవిద్యాలయం ముందంజలో నిల వాలని ఆకాంక్షించారు. శతాబ్ది తర్వాత రెండవ శతాబ్దంలోకి అడుగుపెడుతున్న ఈ సమయం లో విజ్ఞానం, ఆవిష్కరణలు, సామాజిక బాధ్య తతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి, పూర్వ, ప్రస్తుత వీసీలు, ఆచార్య లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు'
'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి'
93948 55244
షరతులు వర్తిస్తాయి

## జీకేవీధి మండల సమస్యలు పరిష్కరించలని కోరుతూ వినతి పత్రం



**గూడెం కొత్త వీధి,,పెన్ పవర్,మార్చి 25:** గూడెం కొత్తవీధి మండలంలో నెలకొన్న ప్రాథమిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని జనసేన పార్టీ మండల నాయకులు కోరారు. బుధవారం పాడేరు లో అరకు పార్లమెంట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ గొర్లె వీరవెంకట్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జానపద కళలు మరియు సృజనాత్మక అకాడమీ చైర్మన్ డాక్టర్ వంపూరు గంగులయ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. మండలం మారుమూల ప్రాంతంలో ఉండటంతో అనేక సమస్యలు సంవత్సరాలుగా పరిష్కారానికి నోచుకోవడం లేదని వారు పేర్కొన్నారు. ముఖ్యంగా రహదారులు, డ్రైనేజ్, మంచినీటి సమస్యలు అనేక గ్రామాల్లో తీవ్రంగా ఉన్నాయని తెలిపారు. ప్రజలు రోజువారీ జీవనంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కావున కూటమి ప్రభుత్వం ఈ సమస్యలను గుర్తించి తక్షణ చర్యలు తీసుకోవాలని, అలాగే జనసేన పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి ఈ సమస్యలను తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అరకు పార్లమెంట్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు గొర్లె వీరవెంకట్, గడుతురి పరమేశ్వరరావు, గబులంగి గణేష్, జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి ఉల్లి సీతారాం, సీదేరి రామమూర్తి, వసుపరి ప్రసాద్ రఘునాథ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## మారుమూల గ్రామాలకు రోడ్లు వేయండి.


- టీ. ఎన్. ఎస్. ఎఫ్ అరకు పార్లమెంటు అధ్యక్షుడు. పట్టిబోయిన శంకర్ నాయుడు.



**హుకుంపేట పెన్ పవర్ మార్చ్ 25** అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేట మండలం మారుమూల గ్రామాలకు రోడ్ల సౌకర్యం కల్పించాలని చాలా గ్రామాలకు రోడ్లు లేవని అత్యవసర పరిస్థితుల్లో అనారోగ్యానికి గురైనప్పుడు డోలియే దిక్కు అవుతుందని ఆయన జిల్లా కలెక్టర్ తో అన్నారు. అంతేకాకుండా కొన్ని గ్రామాలను గుర్తించి ఆయన కలెక్టర్కు రోడ్లు సౌకర్యం కల్పించండి అంటూ వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అల్లూరి జిల్లా కలెక్టర్. సానుకూలంగా స్పందిస్తూ అధికారులతో చర్చలు చేసి రోడ్డు సౌకర్యం లేని ప్రతి గ్రామాన్ని గుర్తించి ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే రోడ్లు మంజూరు చేస్తానని ఈ సందర్భంగా ఆయన అన్నారు.

## వైద్య సహాయం కోసం ఎవరూ అధైర్యపడొద్దు

-శాసన సభ్యులు, పియుసి ఛైర్మన్ కూన రవికుమార్.



**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, శ్రీకాకుళం. మార్చి 25 :** వైద్య సహాయం కోసం ఎవరూ అధైర్యపడొద్దని ఆమదాలవలస నియోజక వర్గ శాసన సభ్యులు, పియుసి చైర్మన్ కూన రవి కుమార్ స్పష్టం చేశారు. ఆమదాలవలస మండలంలోని ఇటీవల అనారోగ్యంతో బాధపడుతున్న పలు కుటుంబాలకు వైద్య ఖర్చులు నిమిత్తం ఆర్థిక సహాయంగా వారి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సి.ఎం.ఆర్.ఎఫ్) నుండి వచ్చిన చెక్కులను పంపిణీ చేశారు. ఈ చెక్కులను ఆమదాలవలస శాసన సభ్యులు, రాష్ట్ర పియుసి చైర్మన్ కూన రవికుమార్ సతీమణి పొందూరు మండల మాజీ ఎంపీపీ కూన ప్రమీలా స్వయంగా లబ్ధిదారులు కుటుంబాల ఇంటి వద్దకు వెళ్లి వారిని పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకొని లబ్దిదారులకు చెక్కులు అందజేశారు.

## డిజిటలైజేషన్‌లో 34వ వార్డు 100% పూర్తి కార్యకర్తలకు సత్కారం



**విశాఖ దక్షిణం, పెన్ పవర్, మార్చి 25 :**దక్షిణ నియోజకవర్గంలో వైఎస్ఆర్సిపి క్యాడర్ రిజిస్ట్రేషన్ డిజిటలైజేషన్ ప్రక్రియ దాదాపుగా పూర్తికాగా, 34వ వార్డులో ఈ కార్యక్రమం విజ యవంతంగా ముగిసింది. మాజీ కార్పొరేటర్ తోట పద్మావతి ఆధ్వర్యంలో 100 శాతం పూర్తి చేసిన సందర్భంగా వార్డు నాయకులు, కార్యకర్త లకు చిన్నపాటి సత్కారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వీట్ బాక్సులు పంపిణీ చేసి వారిని అభినందించారు. ఈ కార్యక్రమానికి హాజరైన వాసుపల్లి గణేష్ కుమార్ మాట్లాడుతూ, కార్య కర్తలకు నేరుగా గుర్తింపు లభించే విధంగా డిజి టలైజేషన్ ప్రక్రియను ప్రతిష్టాత్మకంగా చేపట్టి నట్లు తెలిపారు. గతంలో జరిగిన లోపాలను సరిదిద్దుకుంటూ వైఎస్ఆర్సిపి నూతన ఉత్సా హంతో ముందుకు సాగుతోందన్నారు. ప్రస్తుత ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ, కూటమి పార్టీలు ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చాయ ని, పాలనలో విఫలమవుతున్నాయని ఆరోపిం చారు. అధిక అప్పులు చేసి ప్రజలపై భారం మో పుతున్నారని, ప్రజలకు గణనీయమైన ప్రయో జనం కల్పించలేకపోయారని విమర్శించారు.

మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాలనలో సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అమలయ్యా యని పేర్కొంటూ, ప్రజా సమస్యల పరిష్కారం లో వైఎస్ఆర్సిపి ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు తమ ఓటు తో సరైన నిర్ణయం తీసుకుంటారని, వైఎస్ఆ ర్సిపి తిరిగి అధికారంలోకి వస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు సనపల రవీంద్ర భారత్, రాష్ట్ర నాయకులు బడి దబోయిన అప్పారావు, లండ రమణ, లింగం శ్రీను, సోషల్ మీడియా ప్రతినిధులు బేవార మ హేష్, నాగుల శ్రీను, వాసుపల్లి ధనరాజు, సూరి బాబు, కడవల నాగమణి, గరికిన వెంకటేష్, విజయ, పూడి జయలక్ష్మి, ఆశ, సత్యవతమ్మ, మంజు తదితరులు పాల్గొన్నారు.

# జనసేన శాసనసభాపక్ష సమావేశం

### స్థానిక ఎన్నికలపై 100% విజయ లక్ష్యం



**విశాఖ దక్షిణం, పెన్ పవర్, మార్చి 25 :**జనసేన పార్టీ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ ఉప ము ఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో విజయవాడలో జనసేన శాసనసభాపక్ష సమా వేశం జరిగింది. ఈ కీలక సమావేశానికి విశాఖ దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీని వాస్ సహా పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ లు, ఎంపీలు హాజరయ్యారు. సమావేశంలో రాబోయే రాజకీయ పరిస్థితులు, పార్టీ బలోపే తం, స్థానిక సంస్థల ఎన్నికల వ్యూహాలపై పవన్ కళ్యాణ్ సమగ్ర దిశానిర్దేశం చేశారు. పార్టీకి చెం దిన ప్రజాప్రతినిధులు ప్రజలకు మరింత చేరువ కావాలని, కూటమి భాగస్వామ్యంతో సమన్వ యంగా పనిచేయాలని సూచించారు. జనసేనకు చెందిన మంత్రులు నిర్వహిస్తున్న శాఖల పనితీ రుపై కూడా చర్చ జరిగింది. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, అటవీ శాఖలలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, పౌరసరఫరాలు మరి యు వినియోగదారుల వ్యవహారాల శాఖలో చేపట్టిన సంస్కరణలు, పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల పురోగతిని పవన్ కళ్యాణ్ ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఈ శాఖల ద్వారా ప్రజలకు అందుతున్న సేవలను క్షేత్రస్థాయిలో మరింత సమర్థవంతంగా అందించాలని ఎమ్మె ల్యేలకు సూచించారు. ప్రజల ప్రాథమిక అవ సరాలైన రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ, తాగు నీటి సదుపాయం, గృహ నిర్మాణం, పారిశుధ్యం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని స్పష్టం చేశారు. ప్రతి నియోజకవర్గంలో ఈ సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేయా లని ప్రజాప్రతినిధులకు సూచించారు.

అలాగే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసే న పార్టీ 100 శాతం విజయాన్ని సాధిం చడమే లక్ష్యంగా పెట్టుకోవాలని పిలుపుని చ్చారు. గ్రా మ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసి, కూట మి స్ఫూర్తితో ముందుకు సాగాలని నాయకుల కు దిశానిర్దేశం చేశారు.

### శ్రీరామ నవమి ఉత్సవాలకు ఏర్పాట్లు-చింతపల్లి రామాలయంలో సీతారాముల కళ్యాణ పందిరి రాట ను వేసిన భక్తులు.

**చింతపల్లి పెన్ పవర్ మార్చ్ 25.** మండల కేంద్రంలోని స్థానిక రామాలయం లో శ్రీరామనవమి ఉత్సవాల సందర్భంగా బుధవారం స్వామివారి రాటను రమణ దంపతులు వేశారు. ఈ నెల 27 నుంచి శ్రీరామ నవమి ఉత్సవాలు ప్రారంభంకా ఉన్నాయి. అదే రోజు సీతారాముల కళ్యాణం నిర్వహించనున్నారు. ఈ కళ్యాణం కోసం ఉత్సవ కమిటీ సభ్యులు బుధవారం రాట కార్యక్రమాన్ని పూజలు నిర్వహించి,ఘనంగా ప్రారంభం చేశారు. గత కొంతకాలంగా స్థానిక రామాలయంలో సీతారాముల కళ్యాణం ఘనంగా నిర్వహిస్తూ వస్తున్నారు. ఈ కార్యక్రమానికి గ్రామస్తులే కాకుండా మండలంలోని వివిధ ప్రాంతాల నుండి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారు. సీతారాముల కళ్యాణం అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు.



## గ్యాస్ వంటనూనెల ధరలు దలకు చెక్ పెట్టండి.



**గుమ్మలక్ష్మీపురం మార్చి 25 పెన్ పవర్.**పశ్చిమ సీయో యుద్ధం నేపథ్యంలో గ్యాస్ మరియు వంట నూనెల ధరలు రోజురోజుకీ మండిపోతున్నాయని కృప నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ అడ్డాకుల చిన్నారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. గుమ్మలక్ష్మీపురం మండల కేంద్రంలో బుధవారం నాడు విలేకరులతో మాట్లాడుతూ. హెచ్పిజి ఇండియన్ భారత్ ఏజెన్సీల గ్యాస్ కొరకు బుక్ చేసుకుని వారం పదేశి రోజులు నిరీక్షిస్తున్న ఎల్పిజి ఏజెన్సీల చుట్టూ తిరుగుతున్న బండలుమాత్రం చేతికి రావడం లేదని తద్వారా పట్టెడు మెతుకులు నూటికి అందించడానికి పడరాని పాట్లు తప్పడం లేదంటూ ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నిప్పుకి గాలి తోడైనట్లు గ్యాస్ కష్టాలకు బదులుగా వంటనూనెల ధరలు రోజులు వివదిలో ఆకాశానికి ఎగబ్రాకుతున్నాయన్నారు. ప్రస్తుత పరిస్థితుల దృశ్య గ్యాస్ నల్ల బజార్లో గృహ అవసరాలకు వినియోగించే సిలిండర్ ధర 1600గా పలుకుతుంది ఇందుకు తగ్గట్టు వంటనూనెల ధరలు సైతం పరుగులు పెడుతూనే కిలో నూనె ఒక ఇంటికి రకమును బట్టి రిఫండ్ ఆయిల్,ఆధార్, పామోలిన్ ధరలు 175 నుండి 200 వరకు చెల్లించాల్సి వస్తుందన్నారు. దీంతో మధ్యతరగతి ప్రజలు కూలీలు ఆందోళన చెందుతున్నారు. వీటి దృశ్య కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చొరవ తీసుకుని వీటిపై కఠిన చర్యలు పూనుకోవాల్సిందిగా చిన్నారావు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు కోలక జయరాం, కురుపాం నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు పాలకు సంపత్ కుమార్ పాల్గొన్నారు.

# మంచినీటి కొరత తీర్చిన సర్పంచ్ పుష్పలతకు కృతజ్ఞతలు.

కందుల గాది గ్రామస్తులు.



**చింతపల్లి పెన్ పవర్ మార్చ్ 25.** చింతపల్లి మేజర్ పంచాయతీ కందుల గాది గ్రామంలో మంచినీటి కొరతను తీర్చిన సర్పంచ్ దరియా పుష్పలతకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం కంతులుగారి గ్రామంలో మంచినీటి సరఫరాను సర్పంచ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చింతపల్లి మేజర్ పంచాయితీ కందుల గాది గ్రామంలో నాలుగు వీధులకు కలిపి గత ప్రభుత్వ హయాంలో జలజీవన్ మిషన్స్ కింద 22 లక్షలతో 20 వేల లీటర్లు మరియు 10లీటర్లు, రెండు పంపుసెట్ లు , టాప్ కనెక్షన్లు మంజూరైనప్పటికీ ఆ నిధులు సరిపోలేదన్నారు. దీంతో పంచాయతీ నుంచి అదనంగా సుమారు పది లక్షల రూపాయలు మంజూరు చేసి కందుల గాది నాలుగు వీధులకు పనులు పూర్తి చేసి నీటి సరఫరాను అందించడం జరిగిందన్నారు. ఎప్పటినుంచో తమ గ్రామానికి నీటి కొరత ఉన్నదని సర్పంచ్ పుష్పలత చొరవతో ఆ బాధలు తొలగిపోయాయని గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ వార్డు మెంబర్ చిట్టిబాబు, సీనియర్ నాయకులు సాగిన గంగన్న పడాల్, భూసరి కృష్ణ, మాజీ మండల అధ్యక్షులు మోరి రవి, మాజీ వాలంటీర్ ప్రెసిడెంట్ వేములపూడి పరమేష్, రామకృష్ణ, మత్స్యరాజు, పాస్టర్ శోభన్ బాబు, కూటమి నాయకులు మార్కెట్ కమిటీ డైరెక్టర్ పెద్దిరెడ్డి భేతాళుడు, బీసీ సెల్ మండల అధ్యక్షులు లక్కోజు నాగభూషణం, టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షులు రేమల ఆనంద్, జనసేన నాయకుడు కిముడు కృష్ణమూర్తి, నూతన సతీష్, కో రావు గాంధీ మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులకు ఉచిత వైద్య పరీక్షలు






**స్టాఫ్ రిపోర్టర్,పాడేరు,పెన్ పవర్, మార్చి 25**: అల్లూరి సీతారామరాజు జిల్లాలో పనిచేస్తున్న జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యుల ఆరోగ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎ.ఎస్. దినేష్ కుమార్ తెలిపారు. పాడేరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో అల్లూరి జిల్లా సమాచార, పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో జర్నలిస్టుల కోసం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించిన ఈ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ, సాధారణ ఆరోగ్య పరీక్షలతో పాటు రక్తపోటు, షుగర్, ఈసీజీ, ఈఎన్‌టీ వంటి ప్రత్యేక పరీక్షలను ఈ శిబిరంలో నిర్వహించడం అభినందనీయమన్నారు. జర్నలిస్టులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. నిరంతరం ప్రజా క్షేత్రంలో పనిచేస్తూ వార్తా సేకరణలో నిమగ్నమయ్యే జర్నలిస్టులు తమ ఆరోగ్యంపై కూడా శ్రద్ధ వహించాలని, అందుకోసం ఈ ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అర్హులైన జర్నలిస్టులు నిర్ణీత సమయానికి ఆసుపత్రికి వచ్చి ఈ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. అలాగే హెల్త్ కార్డు ద్వారా జర్నలిస్టులకు అందించే వైద్య సేవలపై ఆరోగ్య మిత్ర కోఆర్డినేటర్‌ను కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. అక్రిడేటెడ్ జర్నలిస్టులతో పాటు నాన్-అక్రిడేటెడ్ జర్నలిస్టులకు కూడా ఇలాంటి వైద్య పరీక్షలు నిర్వహించాలని జర్నలిస్టులు కోరగా, వారి వివరాలను అక్రిడేషన్ కమిటీ ద్వారా సమర్పించాలని, కమిటీ నిర్ణయం అనంతరం చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాడేరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. శ్రీనివాసరావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కృష్ణమూర్తి నాయక్, పలువురు వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా ముగిసిన నాలుగవ జాతీయ సెమినార్.

**చింతపల్లి పెన్ పవర్ మార్చి 25.** చింతపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన నాలుగవ జాతీయ సెమినార్ కార్యక్రమాలు ఘనంగా ముగి సాయి. గత రెండు రోజులుగా క్రీడలలో పోషకాహారం, మానసిక ఆరోగ్యం మరియు వ్యక్తిత్వ వికాసం పాత్ర అనే అంశాలపై ప్రధాన వక్తలు ప్రొఫెసర్ రాజేష్ కుమార్, ఎల్ బి లక్ష్మీకాంత్ రాథోడ్, సునీల్ ముగింపు ఉత్సవ కార్యక్రమంలో మాట్లాడారు. దేశ నిర్మాణానికి యువత చాలా కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. దేశ భవిష్యత్తు యువత చేతుల్లో ఉందని పోషకాహారం తీసుకుంటూ మానసిక ఆరోగ్యం పెంపొందించుకొని శారీరక ఆరోగ్యంతో యువత ముందుకు సాగాలన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం విజయ భారతి మాట్లాడుతూ విద్యార్థి దశ నుండి ఆరోగ్యకరమైన ఆహారాన్ని అలవర్చుకోవాలని మరియు వ్యక్తిత్వాన్ని అభివృద్ధి పరచుకోవాలని తెలిపారు. కళాశాల ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు ఈ నాలుగవ జాతీయ సెమినార్ ను నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఆహ్వానితులు పీఎం ఉషా ప్రోగ్రాం నిర్వహణ కర్త ప్రసాద్ ,జగదీష్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ మినుముల శ్రీనివాస పాత్రుడు, పి యం ఉష కోఆర్డినేటర్ డాక్టర్ వరు రమణ, సెమినార్




కన్వీనర్ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ కె శివరాంకుమార్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# అరకులోయలో అనుమానాస్పద మృతి.



ముగ్గురు మైనర్లును అదుపులో తీసుకొన్న పోలీసులు.

**అరకులోయ పెన్ పవర్ 25:**అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయ మండలంలో అనుమానాస్పద మృతి ఘటన కలకలం రేపింది. మండల కేంద్రానికి సమీపంలోని చిన్నలబుడూ



గ్రామపంచాయితీ పరిధిలోని హట్టగూడ గ్రామం దగ్గర ఉన్న రూపా రిసార్ట్స్‌లో యువకుడు మృతి చెందిన సంఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. కుటుంబాల సభ్యులు వివరాల ప్రకారం,విజయనగరం జిల్లా తెర్లాం మండలం జన్నీవలస గ్రామానికి చెందిన నాగర్ల సురేష్ (సుమారు 30) మంగళవారం ఉదయం రిసార్ట్స్‌లో గది అద్దెకు తీసుకున్నాడు. అయితే అదే రోజు రాత్రి సుమారు 9 గంటల సమయంలో అనుమానాస్పద పరిస్థితుల్లో మృతిచెందాడు.
ఈ ఘటనపై సమాచారం అందుకున్న హట్టగూడ గ్రామస్థులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. స్థానికుల ఆరోపణల మేరకు, ముగ్గురు మైనర్ బాలురు మద్యం, గంజాయి సేవించి మత్తులో సురేష్‌ను హత్య చేసి ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అరకులోయ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఘటనకు సంబంధించి ముగ్గురు మైనర్ బాలురను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు సమాచారం. పూర్తి వివరాలు దర్యాప్తు అనంతరం వెలుగులోకి వచ్చే అవకాశముందని పోలీసులు తెలిపారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర ఆందోళనకు దారితీసింది.

# తక్షణం గ్యాస్ కొరత తీర్చండి.



**అరకులోయ పెన్ పవర్ 25:**అల్లూరి జిల్లా గిరిజన ప్రాంతం లో గ్యాస్ కొరత తీవ్రంగా ఉందని తక్షణం కొరతను తీర్చాలని అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐధ్వా) డిమాండ్ చేసింది ఈ మేరకు మండలంలో సుంకరమెట్ట బంగ్లవలస గ్రామంలో గ్రామస్తులతో కలసి నిరసన తెలియజేశారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి జిల్లా నాయకులు వివి జయ మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు కనీసం అవసరాలు తీర్చలేని ప్రభుత్వాలు ఎందుకు అని ప్రశ్నించారు ఇజ్రాయిల్ అమెరికా ఏకపక్షంగా ఇరాన్ పై జరుగుతున్న యుద్ధాల కారణంగా భారతదేశంలో సామాన్యుడు అత్యంత ఆర్థికంగా సంక్షోభంలో కూరుకుపోతున్నాడు ప్రతి కుటుంబానికి నిత్యవసర వస్తువుగా మారిన గ్యాస్ గత 20 రోజులుగా కొరత ఏర్పడింది అంతేకాకుండా నిత్యవసర సరుకులు ధరలు రోజురోజుకు పెరుగుతున్నాయని అన్నారు ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు గత 20 రోజుల నుండి గ్యాస్ కొరత తీవ్రంగా ఉందని ప్రభుత్వానికి ముందుగా తెలుసు కాబట్టి నెల రోజుల ముందే ఆన్లైన్లో గ్యాస్ బుకింగ్ చేసుకోవాలని ప్రకటన ఇచ్చారు ఈ విషయం సామాన్య ప్రజలకి తెలియక గ్యాస్ కొరతతో అనేక ఇబ్బందులు పడుతున్నారు అట్లాగే మార్కెట్లో గ్యాస్ కొరతతో విపరీతమైన ధరల పెంచి బ్లాక్లో అక్కడక్కడ గ్యాస్ అమ్మకాలు జరుగుతున్నాయి సామాన్యులకి గ్యాస్ అందని ద్రాక్షగా మారంది ఈ గ్యాస్ కొరతతో అటు స్కూల్లో హాస్టల్లో చదివే పిల్లలు కోచింగ్ సెంటర్ లో ఉన్న పిల్లలు గ్యాస్ కొరతతో హాస్టల్స్ మూసివేత జరగడంతో ఇంటి బాట పట్టారు పట్టణ ప్రాంతాల్లో హోటల్ మీదే 50 శాతం మంది కార్మికులు జీవనం సాగిస్తున్నారు ఈ హోటల్స్ అన్ని ఈ గ్యాస్ కొరతతో మూతపడ్డాయి అలాగే స్విగ్గి,జమాటో మీద ఆధారపడి వేలమంది ఆన్లైన్ కార్మికులు పనిచేస్తున్నారు. వీళ్ళందరూ గ్యాస్ కొరత తో పని కి దూరమైన పరిస్థితి కనిపిస్తుంది చాప కింద నీరు లాగా బ్లాక్ మార్కెట్లో గ్యాస్ సప్లై జరుగుతున్నాయి అని అన్నారు ప్రభుత్వం సామాన్య ప్రజలకు అర్థం కాని పరిస్థితుల్లో ఈ కేవైసీ ద్వారా గ్యాస్ బుక్ చేసి ఓటిపి చెప్పి గ్యాస్ విడిపించు కోవాలన్నా సామాన్య ప్రజలకు అర్థం కాని పరిస్థితి కావున యధావిధిగా గ్యాస్ .
లేకుండా సప్లై చేయాలి ప్రభుత్వాలు ఈ గ్యాస్ కొరత పరిష్కరించి ఎప్పటిలాగే నిత్యం సామాన్యులకు అందుబాటు రేట్లలో గ్యాస్ సప్లై చేయాలని ఐద్వా డిమాండ్ చేస్తుంది లేని పక్షంలో ప్రతి గ్రామ గ్రామాన ఆందోళన కార్యక్రమం చేస్తాం ఈ కార్యక్రమంలో అరకు వ్యాలీ మండల కార్యదర్శి కె. శశికళ, జిల్లా ఉపాధ్యక్షులు దేవుడమ్మ జిల్లా కమిటీ సభ్యులు సన్యాసమ్మ దేవి మండల కమిటీ సభ్యులు తుల చిన్నాలమ్మ భవాని తదితరులు పాల్గొన్నారు.

# సబాల్ ప్రాజెక్ట్ కమిటీలు ఏర్పాటు పూర్తి

**సబల్ ప్రాజెక్ట్ లో భాగంగా బహుళ భాగస్వాముల కమిటీ ఏర్పాటు**



**హుకుంపేట పెన్ పవర్ మార్చి 25 :**అల్లూరి సీతారామరాజు జిల్లా సింగర్భ గ్రామ సచివాలయంలో సబల్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో నిర్వహించిన బహుళ భాగస్వాముల భూప్రదేశ యాజమాన్య కమిటీ ఏర్పాటు పైన సమావేశం నిర్వహించారు సభల్ ప్రాజెక్ట్ ద్వారా గత మూడు సంవత్సరాలుగా ఎమ్.నిట్టాపుట్టు ల్యాండ్ స్కేప్ కు సంబంధించిన మొత్తం 18 గ్రామాలలో వివిధ జీవనోపాధి కార్యక్రమాలు చేస్తూ శిక్షణలు ఇవ్వడం జరుగుతుందని. దానిలో ముఖ్యంగా ప్రకృతి వ్యవసాయం ప్రోత్సహించుట, రైతులకు ఈ ప్రాజెక్టు ద్వారా సహాయ సహకారాలు అందించడం జరుగుతుంది అని .ఈ కమిటీ ప్రధాన లక్ష్యం గ్రామాల్లో జీవవైవిధ్యం పెంపొందించుటకు, తదనగుణంగా ప్రణాళికలు ఏర్పాటు చేసి, వాటి అమలు కోసం పనిచేయవలసిన ఆవశ్యకత ఉన్నది.సబాల్ అధికారులు అన్నారు
ఈ కమిటీ సభ్యులుగా గ్రామ సర్పంచ్, వివో లీడర్లు, విఎస్ఎస్ కమిటీ సభ్యులు, సచివాలయ సిబ్బంది, అటవీ శాఖ సిబ్బంది, ఉపాధి హామీ సిబ్బంది, వెలుగు సిబ్బంది, పశు శాఖ సిబ్బంది, మరియు సబల్ ప్రాజెక్టు సిబ్బంది, రైతు సాధికార సంస్థ సిబ్బంది వీరి అందరితో కలిపి ఈరోజు బహుళ భాగస్వాముల భూప్రదేశా యాజమాన్య కమిటీ ఏర్పాటు చేయడం అని తెలియజేసారు
ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ సిబ్బంది, వెలుగు సిబ్బంది, గ్రామ సర్పంచ్, ఎన్జీవో సభ్యులు ఆర్ వై ఎస్ ఎస్ ప్రతినిధులు, వివిధ గ్రామ సంఘాల ముఖ్య ప్రతినిధులు, పంచాయతీ సెక్రెటరీ పవన్ , హెచ్ వి రాజు సబల్ ప్రాజెక్టు నుంచి ఎఫ్ ఈ ఎస్ మేనేజర్ రమేష్ బాబు, జ్యోతి బాబు, బొజ్జన్న వాసన్ సంస్థ నుంచి అల్లూరి జిల్లా నుంచి ఇంచార్జి నాయుడు, సిసి ప్రకాష్,సీసీ మాణిక్యం,సీసీ సత్యనారాయణ, దామోదర్ (ప్రోగ్రాం అసోసియేషన్ ) మరియు ఆర్ వై ఎస్ ఎస్ ఏల్ 2 ప్రసాద్ మరియు షజ్ లీడర్ వి ఓ లీడర్స్ మరియు రైతులు పాల్గొనడం జరిగినది.

# షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగాల కోసం పోరాటం



**స్టాఫ్ రిపోర్టార్,పాడేరు,పెన్ పవర్, మార్చి 25:** షెడ్యూల్డ్ ప్రాంతంలో ఉద్యోగ నియామకాల కోసం ప్రత్యేక చట్టం చేయాలని ఆదివాసీ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఏప్రిల్ 3న పాడేరులో నిర్వహించనున్న ఆదివాసీ సత్యాగ్రహ యాత్ర భారీ ర్యాలీని విజయవంతం చేయాలని అల్లూరి సీతారామరాజు జిల్లా జేఏసీ చైర్మన్ రామారావు దొర పిలుపునిచ్చారు.జి. మాడుగుల మండలం సొలభం గ్రామం నుంచి ఆదివాసీ సత్యాగ్రహ యాత్రను సొలభం పంచాయతీ సర్పంచ్ ఐసరం హనుమంతరావు అధ్యక్షతన ప్రారంభించారు. యాత్ర బుధవారం 136వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా రామారావు దొర మాట్లాడుతూ రాష్ట్రంలోని అనేక గ్రామాలను పర్యటిస్తూ షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగాల నియామకాల కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నామని తెలిపారు.
ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదివాసీ ప్రాంత ఉద్యోగాలన్నీ స్థానికులకే కల్పించేలా చట్టం చేస్తామని పలు సందర్భాల్లో హామీ ఇచ్చారని, కానీ ఇప్పటివరకు ఆ హామీ అమలు కాలేదని ఆరోపించారు. 2025 ఆగస్టు 9న పాడేరులో సీఎం ఇచ్చిన హామీని గుర్తు చేస్తూ, వెంటనే చట్టం చేయాలని డిమాండ్ చేశారు. స్టేట్ కేడర్ పోస్టుల్లో 30 శాతం, జోనల్ కేడర్ పోస్టుల్లో 50 శాతం, లోకల్ కేడర్ పోస్టులన్నీ స్థానిక ఆదివాసీలకే కేటాయించేలా సమగ్ర చట్టం చేయాలని జేఏసీ కోరింది. షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగాల చట్టం అమలు కాకపోతే ఉద్యమాలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ మొట్టడం రాజబాబు మాట్లాడుతూ జీవో నంబర్ 3 రద్దుతో ఆదివాసీలకు తీవ్ర నష్టం జరిగిందని విమర్శించారు. గిరిజన సలహా మండలి (టీఏసీ) ద్వారా చట్టం చేయాలని, పెసా చట్టం, అటవీ హక్కుల చట్టం, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాలను కఠినంగా అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు పార్థు, స్వామి, గంగరాజు, గిరిజన విద్యార్థి సంఘం డివిజన్ అధ్యక్షుడు మణుగూరు బాబుజీ, పార్థసారథి తదితరులు పాల్గొన్నారు. పలు గ్రామాల్లో ప్రచారం నిర్వహిస్తూ ఏప్రిల్ 3న పాడేరులో జరగనున్న ర్యాలీకి ప్రజలను ఆహ్వానించారు.

# జీకే వీధిలో శ్రీరామ నవమి ఉత్సవాల సందడి ప్రారంభం





**గూడెంకొత్తవీధి,పెన్ పవర్, మార్చి 25:**మండలంలోని జీకేవీధిలో శ్రీరామ నవమి ఉత్సవాల సందడి మొదలైంది. ఈనెల 27న శ్రీరామనవమి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. అదే రోజు సీతారాముల కళ్యాణం జరపనున్నారు. ఈ కళ్యాణం కోసం ఉత్సవ పందిరి రాట కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా ఉత్సవ కమిటీ నిర్వహించింది. స్థానిక మహిళలు గిరిజనులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి పందిరిరాట వేసి ఉత్సవాలు ప్రారంభించార ప్రతీ ఏటా ఆనవాయితీగా సీతారాముల కళ్యాణం కోసం ఉత్సవ కమిటీ పందిరి రాట వేసిన అనంతరం నూతులు గ్రామానికి చెందిన గిరిజనులు పందిరి వేసి తమ భక్తిని చాటుకుంటారు. ఈ ఏడాది కూడా నూతుల గ్రామస్తులు కళ్యాణ పందిరి వేసి అనవాయితీ కొనసాగించారు. ఈనెల 27న ఉత్సవమూర్తుల ఊరేగింపు, సీతారాముల కళ్యాణం వైభవంగా నిర్వహించనున్నారు. భక్తులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు రీమల రాజేశ్వరి, ఆలయ పూజారి సాత ఆనందరావు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు గొర్లె వీరవెంకట్, ముక్కలి గిరి, రీమల పాలు, సురకత్తి లక్ష్మణ్ బాబు, వంపురి శోభన్, ముక్కలి రమేష్, ముక్కలి వెంకటరావు, పసుపులేటి రాజు, ముక్కలి తేజ, కొండగిచంగి మనోజ్, మహిళా ప్రతినిధులు, నూతులు గ్రామస్తులు పాల్గొన్నారు.

# యుటిఎఫ్ ఆధ్వర్యంలో రణభేరి 3.0

**నర్సీపట్నం, పెన్ పవర్ (మార్చి 25) :**యుటిఎఫ్ ఆధ్వర్యంలో నర్సీపట్నం ఆర్డీవో కార్యాలయం ఎదుట అపరిష్కృత సమస్యల పరిష్కారం కోసం రణభేరి 3.0 నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి జిల్లా కార్యదర్శి ఎం. సంతోష్ కుమార్ మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు రాష్ట్రంలోని 175 అసెంబ్లీ నియోజకవర్గాల ప్రధాన కేంద్రాల్లో ఉన్న రెవెన్యూ కార్యాలయాల ఎదుట ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వం తక్షణమే 12వ పీఆర్సీ ప్రకటించాలని, 29 శాతం ఇంటెర్మ్ రిలీఫ్ ఇవ్వాలని, హెల్త్ ఇన్సూరెన్స్‌ను పకడ్బందీగా అమలు చేయాలని, ఆర్థిక బకాయిలన్నీ క్లియర్ చేయాలని, సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఏప్రిల్ 28న విజయవాడలో ఉపాధ్యాయులు, ఉద్యోగులు, కార్మికులను భారీగా సమీకరించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళనలను ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. నిరసన అనంతరం ఆర్డీవో కార్యాలయం పరిపాలనాధికారికి పై సమస్యలను వివరించి యుటిఎఫ్ ప్రతినిధులు వినతి పత్రాన్ని సమర్పించారు.

ఈ కార్యక్రమంలో నర్సీపట్నం డివిజనల్ కార్యదర్శి చిట్టయ్య, మండల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు సాంబమూర్తి, శోభన్ బాబు, కోటఉరట్ల మండల అధ్యక్షుడు జె. నరసింగరావు, ప్రధాన కార్యదర్శి జేవీ ప్రసాద్ రావు, ఉపాధ్యక్షుడు ఏ.వి. లోవరాజు, సీనియర్ నాయకులు జల్లురి ప్రసాదు, నాగభూషణ్, గొలుగొండ మండల అధ్యక్షుడు సిహెచ్ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## చింతపల్లి నియోజకవర్గ పునరుద్ధరణకు డిమాండ్

- గిరి జన జాగృతి సమన్వయ సమితి అధ్యక్షులు ముర్ల వెంకటరమణ



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్,మార్చి 25:** అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి ప్రాంత సమగ్ర అభివృద్ధి కోసం చింతపల్లి అసెంబ్లీ నియోజకవర్గాన్ని పునరుద్ధరించాలని గిరిజన జాగృతి సమన్వయ సమితి అధ్యక్షుడు ముర్ల వెంకటరమణ డిమాండ్ చేశారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ గతంలో చింతపల్లి నియోజకవర్గంగా ఉన్నప్పటికీ, పరిపాలనా పరిమితులు, ఆర్థిక వనరుల కొరత వంటి కారణాలతో ఆశించిన స్థాయిలో అభివృద్ధి సాధ్యం కాలేదని పేర్కొన్నారు. అయితే నేటి పరిస్థితుల్లో భారీ బడ్జెట్లు, ఆధునిక సాంకేతికత అందుబాటులో ఉన్నందున పునరుద్ధరణ సాధ్యమేనని ఆయన అన్నారు.చింతపల్లి నియోజకవర్గం రద్దు అనంతరం జీకేవీధి, కొయ్యూరు, చింతపల్లి మండలాలు అభివృద్ధిలో వెనుకబడ్డాయని, భౌగోళికంగా కేంద్ర బిందువైన చింతపల్లి ప్రజలకు ఎమ్మెల్యే అందుబాటులో లేకపోవడం సమస్యగా మారిందని తెలిపారు. చిన్నపనుల కోసం కూడా పాడేరుకు వెళ్లాల్సి రావడం ప్రజలకు ఆర్థిక, శారీరక భారంగా మారిందన్నారు.విద్య, వైద్యం, ఉపాధి, రవాణా వంటి ప్రాథమిక రంగాల్లో ప్రాంతం వెనుకబాటుకు గురైందని ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాలలు, ఆసుపత్రుల్లో మౌలిక సదుపాయాల కొరత, యువతకు ఉపాధి అవకాశాల లోపం, రోడ్ల దుస్థితి ప్రజల జీవితాలను ప్రభావితం చేస్తున్నాయని పేర్కొన్నారు.గతంలో ఈ ప్రాంతంలో ఉన్న పట్టుపురుగుల పరిశ్రమ, డైరీ ఫారం, ఐటిడిఎ పీఓ క్యాంపు కార్యాలయం వంటి ప్రభుత్వ సంస్థలు క్రమంగా రద్దు కావడం వల్ల స్థానికంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కోల్పోయామని చెప్పారు.ఈ పరిస్థితుల దృష్ట్యా చింతపల్లి అసెంబ్లీ నియోజకవర్గం పునరుద్ధరణ ద్వారా మాత్రమే ఈ ప్రాంతానికి న్యాయం జరుగుతుందని, ప్రజలకు చేరువగా పాలన అందుబాటులోకి వస్తుందని వెంకటరమణ పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

## నర్సీపట్నంలో తొలిజాగరంతో మొదలైన మరిడమ్మ జాతర





-నర్సీపట్నంలో ఆధ్యాత్మిక శోభ

**నర్సీపట్నం, పెన్ పవర్ (మార్చి 25) :**నర్సీపట్నంలో తొలిజాగరణతో శ్రీమరిడి మహాలక్ష్మి అమ్మవారి గరగల జాతర మంగళవారం రాత్రి అత్యంత వైభవంగా ప్రారంభమైంది. పట్టణంలో ఆధ్యాత్మిక సందడి నెలకొనగా, మొదటి రోజు నిర్వహించిన 'తొలి జాగారం' ఉత్సవం కనులపండువగా సాగింది. శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు పాత నివాసం వద్ద ఆయన సతీమణి చింతకాయల పద్మావతి వారి కుటుంబ సభ్యులు అమ్మవారి గరగలకు పాన్పు వేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పద్మావతి, వారి కుటుంబ సభ్యులు భక్తిశ్రద్ధలతో గరగలను తలపై ధరించి ఊరేగింపుగా బయలుదేరారు. డప్పు వాయిద్యాలు, కోలాట నృత్యాలు, భక్తుల జయజయధ్వానాల మధ్య నర్సీపట్నం పురవీధులన్నీ భక్తి పారవశ్యంతో పులకించాయి.

అయ్యన్నపాత్రుడు పాత నివాసం నుంచి ప్రారంభమైన ఈ గరగల ఊరేగింపు 5 రోడ్ల జంక్షన్, తుని రోడ్డు, మెదర వీధి, వేంకటేశ్వర స్వామి గుడి, పాలఘాట్ సెంటర్, శారదానగర్, మెయిన్ రోడ్డు, రామారావుపేట, కుమ్మరి వీధి, కాపు వీధి మరియు నూకాలమ్మ మాన్యం రోడ్డు మీదుగా సాగింది. బుధవారం తెల్లవారేసరికి తిరిగి గరగలు అయ్యన్నపాత్రుడు నివాసం వద్ద ఉన్న రామాలయానికి చేరుకున్నాయి. భక్తులు అడుగడుగునా అమ్మవారికి నీరాజనాలు అర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

ఈ సందర్భంగా స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ మరిడి మహాలక్ష్మి అమ్మవారు తమ ఇంటి ఇలవేల్పు అని, రెండేళ్లకోసారి వచ్చే ఈ వేడుకను తమ కుటుంబం ఎంతో భక్తితో నిర్వహిస్తోందని తెలిపారు. ఈ నెల 26న రెండో జాగారం, 28న మూడో జాగారం, 31న పెద్ద జాగారం నిర్వహిస్తామని, ఏప్రిల్ 1వ తేదీన మరిడమ్మ పండుగ అంగరంగ వైభవంగా జరుగుతుందని వివరించారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్, చింతకాయల రాజేష్, పార్టీ నాయకులు మరియు పట్టణ పెద్దలు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## 20 లీటర్ ల సారా స్వాధీనం.


వ్యక్తిపై కేసు నమోదు, రిమాండ్ కు తరలింపు.

ఎక్సైజ్ శాఖ మెరుపు దాడులు.

**చింతపల్లి పెన్ పవర్ మార్చ్ 25.**అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండలం కొర్రు బయలు గ్రామ శివారులో బుధవారం ఉదయం ఎక్సైజ్ అధికారులు మెరుపు దాడి నిర్వహించారు. జిల్లా ప్రోహిబిషన్ & ఎక్సైజ్ అధికారి ఆదేశాల మేరకు, నమ్మదగ్గ సమాచారంతో చింతపల్లి ఎక్సైజ్ ఎస్సై ఎన్. రాంబాబు మరియు వై . చైతన్య తమ సిబ్బందితో కలిసి ఈ దాడులు చేపట్టారు. కొర్రు బయలు గ్రామ సరిహద్దుల్లో ఒక వ్యక్తి రహస్యంగా బట్టీ ఏర్పాటు చేసి నాటు సారా తయారు చేస్తుండగా అధికారులు పట్టుకున్నారు. నిందితుడిని లమ్మసింగి గ్రామానికి చెందిన పోలోజు దేముడు (39) గా గుర్తించారు. నిందితుడి వద్ద నుండి 20 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. అలాగే సారా తయారీ కోసం నిల్వ ఉంచిన 200 లీటర్ల బెల్లం ఊటను గుర్తించి, దానిని అక్కడికక్కడే ధ్వంసం చేశారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ సిబ్బంది కె. రమేష్, డి. కుమార్, జి. శివ మరియు జి. చంద్ర రావు పాల్గొన్నారు.



## వేసవి వడగాల్పుల దృష్ట్యా ఉపాధి హామీ శ్రామికులకు పలు జాగ్రత్తలు సూచించన ఎంపీడీవో....



**నాతవరం,పెన్ పవర్ (మార్చి 25):** ఉపాధి హామీ శ్రామికులు వేసవి వడగాల్పులు దృశ్యా పలు జాగ్రత్తలు తీసుకోవాలని మండల అభివృద్ధి అధికారి ఎం.సత్య శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్లతో ఆయన సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రామికులు ఈ వేసవికాలంలో పనులకు వచ్చేటప్పుడు ఎండ తీవ్రత పెరగకముందే ఉదయం 6 గంటల నుండి 11 గంటల వరకు సాయంత్రం మూడు గంటల నుండి 4 గంటల వరకు పనులకు హాజరు కావాలని అన్నారు. ప్రతి ఒక్క వేతన దారుడు రెండు లీటర్ల వాటర్ బాటిల్ లేదా ద్రావణాలు తప్పనిసరిగా తీసుకురావాలని, పని జరిగే ప్రదేశంలో ఏఎన్ఎమ్,ఆశ వర్కర్లతో కలిసి వడగాల్పులు,ఆరోగ్య నియమాలు పై అవగాహన కల్పించాలని తెలియజేశారు.పని జరిగే ప్రదేశంలో నీడ ఏర్పాటు చేసుకోవాలని,అన్ని కుటుంబాలు పనికి హాజరై,వంద రోజులు పనిని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అంతేకాకుండా గ్రామంలో ఉన్న పశువుల తొట్టెలలో నీరు నింపి పశువులకు నీరు అందుబాటులో ఉంచాలని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ డి.కొండాజి,గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## రైతుల అభివృద్ధికి ఓటమి ప్రభుత్వం తోడు

- కూటమి ప్రభుత్వం పశుసంవర్ధక రంగ అభివృద్ధికి ప్రతిష్టాత్మకంగా చేపడుతుంది.
- మన్యం గోబాల సంబరం కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ విప్.తోయక జగదీశ్వరి.



**గుమ్మలక్ష్మీపురం మార్చి 25 పెన్ పవర్.**కొమరాడ మండలం పరుశురాంపురం గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో బుధవారం నాడు మన్యం గోబాల సంబరం (లేగదూడల ప్రదర్శన) కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్,కురుపాం నియోజకవర్గ శాసనసభ్యులు తోయక జగదీశ్వరి హాజరై లేగదూడల ప్రదర్శనను ప్రారంభించి పరిశీలించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పశుసంవర్ధక రంగ అభివృద్ధికి ప్రతిష్టాత్మకంగా ముందడుగు వేస్తూ ఇటువంటి కార్యక్రమాలను చేపడుతున్నదని తెలిపారు.ఈ కార్యక్రమాల ద్వారా పశుసంవర్ధక శాఖ నుంచి లభించే ఆర్థిక వనరులను పెంపొందించుకునే విధంగా రైతులకు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు.కూటమి ప్రభుత్వం ఎప్పుడు రైతుల అభివృద్ధికి,మహిళా సంక్షేమానికి,యువత భవిష్యత్తు కోసం ప్రతీ నిత్యం పని చేస్తోందని అన్నారు.పశు వులకు ప్రభుత్వం రాయితీతో పశు బీమా పథకం అమలు చేస్తున్నదని,అలాగే పాడి రైతులకు సబ్సిడీపై పశువుల దాణా అందజేస్తున్నామని చెప్పారు.ప్రతి పాడి రైతు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.కార్యక్రమంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన లేగదూడల పాడి రైతులకు బహుమతులు అందజేశారు.అలాగే సబ్సిడీ దాణాను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో కురుపాం వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ చైర్ పర్సన్ కడ్రక కళావతి,మండల పార్టీ అధ్యక్షులు శనపతి ఉదయ శేఖర్ పాత్రుడు,జనసేన మండల కన్వీనర్ శ్రీకర్,బిజెపి మండల కన్వీనర్ సురేష్,ఎంపిటిసి సంతోషి కుమారి,స్థానిక సర్పంచ్ పశుసంవర్ధక జెడి మన్మథరావు,పశువైద్యులు, పశుసంవర్ధక శాఖ సిబ్బంది,కూటమి నాయకులు,మరియు పాడి రైతులు,తదితరులు పాల్గొన్నారు.

## సబల్ ప్రాజెక్టు కింద బహుళ భాగస్వాముల కమిటీ ఏర్పాటు

**జి.మాడుగుల,పెన్ పవర్ మార్చి 25 :**సింగర్భ గ్రామ సచివాలయంలో సబల్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో బహుళ భాగస్వాముల భూప్రదేశ యాజమాన్య కమిటీ (మల్టీ స్టేక్‌హోల్డర్ ల్యాండ్‌స్కేప్ మేనేజ్‌మెంట్ కమిటీ) ఏర్పాటు కోసం సమావేశం నిర్వహించారు. గత మూడు సంవత్సరాలుగా ఎం. నిట్టాపుట్టు ల్యాండ్‌స్కేప్ పరిధిలోని 18 గ్రామాల్లో సబల్ ప్రాజెక్టు వివిధ జీవనోపాధి కార్యక్రమాలు చేపడుతూ శిక్షణలు అందిస్తోంది. ముఖ్యంగా ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడం, రైతులకు అవసరమైన సహాయ సహకారాలు అందించడం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా ఎఫ్ఈఎస్ సంస్థ మేనేజర్ రమేష్ బాబు మాట్లాడుతూ, ప్రాంతంలో అటవీ నాశనం పెరుగుతుండటం, జీవవైవిధ్యం దెబ్బతింటుండటం, అడవుల్లో అగ్ని ప్రమాదాలు అధికమవుతుండటం ఆందోళనకరమన్నారు. దీని ప్రభావంతో గ్రామీణ జీవనోపాధులు అయిన వ్యవసాయం, పశుపోషణ కుంటుపడుతున్నాయని పేర్కొన్నారు.చెట్లు, గడ్డి, జీవరాశులు పరస్పర అనుసంధానంతో ఉన్నాయని, జీవవైవిధ్య పరిరక్షణ ఒకరి వల్ల సాధ్యం కాదని చెప్పారు. ప్రభుత్వ శాఖలు, ప్రజలు, వివిధ సంఘాలు కలిసి కమిటీలను ఏర్పాటు చేసి, ప్రజలను భాగస్వాములను చేయాల్సిన అవసరం ఉందని సూచించారు.ఈ కమిటీ ముఖ్య లక్ష్యం గ్రామాల్లో జీవవైవిధ్యాన్ని పెంపొందించడం, దానికి అనుగుణంగా ప్రణాళికలు రూపొందించడం, వాటి అమలు కోసం సమన్వయంతో పనిచేయడం అని తెలిపారు.ఈ కమిటీలో గ్రామ సర్పంచ్, వివో నాయకులు, వన సంరక్షణ సంఘం కమిటీ సభ్యులు, సచివాలయ సిబ్బంది, అటవీ శాఖ, ఉపాధి హామీ పథకం సిబ్బంది, వెలుగు సిబ్బంది, పశు సంవర్ధక శాఖ సిబ్బంది, సబల్ ప్రాజెక్టు సిబ్బంది, రైతు సాధికార సంస్థ ప్రతినిధులు సభ్యులుగా ఉన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ, వెలుగు సిబ్బంది, గ్రామ సర్పంచ్, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, గ్రామ సంఘాల నాయకులు, పంచాయతీ కార్యదర్శి పవన్, హెచ్‌వి రాజు, సబల్ ప్రాజెక్టు నుంచి ఎఫ్ఈఎస్ మేనేజర్ రమేష్ బాబు, జ్యోతి బాబు, బొజ్జన్న, వాసన్ సంస్థ నుంచి ప్రతినిధులు, అల్లూరి సీతారామరాజు జిల్లా ఇన్‌చార్జి నాయుడు, సీసీలు ప్రకాశ్, మాణిక్యం, సత్యనారాయణ, దామోదర్, రైతులు, స్వయం సహాయక సంఘాల నాయకులు పాల్గొన్నారు.



# కేజీహెచ్‌కు రూ.3 లక్షల సీపాప్ యంత్రం విరాళం

**నవజాత శిశువుల ప్రాణరక్షణకు తోడ్పాటు**

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, మార్చి25 :**ఆరోగ్య రంగంలో కార్పొరేట్ సామాజిక బాధ్యత కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్న డాక్టర్స్ ఫర్ యు సంస్థ, కింగ్ జార్జ్ హాస్పిటల్ లోని పిల్లల వైద్య విభాగానికి రూ. 3 లక్షల విలువైన బ్యాటరీ ఆధారిత సీపాప్ యంత్రాన్ని విరాళంగా అందించింది. విద్యుత్ సరఫరా లేకపోయినా ప నిచేసే ఈ ఆధునిక యంత్రం, ముఖ్యంగా లేబర్ రూమ్ మరియు ప్రత్యేక నవజాత శిశు సంరక్షణ విభాగంలో అత్యంత ఉపయోగక రంగా ఉం టుంది. అధిక ప్రమాదంలో ఉన్న నవజాత శిశు వులను ఒక విభాగం నుంచి మరొక విభాగానికి తరలించే సమయంలో శ్వాసను స్థిరంగా ఉం చడంలో ఇది కీలక పాత్ర పోషించనుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ నీయోనటాలజిస్ట్ డా. శ్రీనివాస్ ముర్కి, సీపాప్ వినియోగంపై వైద్య సిబ్బందికి ప్రత్యేక శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. లేబర్ రూమ్‌లో సకా లంలో సీపాప్ వినియోగం ద్వారా శిశువుల ప్రా ణాలను రక్షించవచ్చని ఆయన వివరించారు. పిల్లల వైద్య విభాగం ప్రొఫెసర్ మరియు హెడ్ డా. బి.ఎస్. చక్రవర్తి మాట్లాడుతూ, ఎన్ ఐ సి యు దూరంగా ఉన్న సందర్భాల్లో శిశువులను తరలించే సమయంలో ఈ యంత్రం ఎంతో స హాయకారిగా ఉంటుంది. నవజాత శిశువుల ఆరోగ్య సంరక్షణలో ఇది మెరుగైన ఫలితాలను అందిస్తుంది" అని తెలిపారు.



ఈ కార్యక్రమంలో ఆంధ్ర మెడికల్ కాలేజ్ ప్రిన్సి పాల్ డా. కె.వి.ఎస్.ఎం. సాంధ్యా దేవి, కేజీహెచ్ సూపరింటెండెంట్ డా. ఐ. వాణి, డివైఎఫ్ ప్రతినిధి డా. రేవతి సేవలను ప్రశంసిస్తూ సన్మా నించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స పొం దుతున్న పేద శిశువులకు ఇటువంటి సేవా కార్యక్రమాలు ఎంతో మేలు చేస్తాయని వారు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో డా. రత్నకుమారి, డా. చౌదరి బాబు సహా ప్రొఫెసర్లు, అసోసియేట్ మరియు అసిస్టెంట్ ప్రొఫెసర్లు, పీజీ విద్యార్థులు, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు ఘన స్వాగతం.



**గుమ్మలక్ష్మీపురం మార్చి 25 పెన్ పవర్.** పార్వతీపురం మన్యం జిల్లాలో ఎస్టీ కమిషన్ చైర్మన్ చోళ బొజ్జిరెడ్డి పర్యటనలో భాగంగా గుమ్మలక్ష్మీపురం మండల పర్యటనకు వచ్చిన రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ చోళ్ళ బొజ్జి రెడ్డి ను కురుపాం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పుష్పగుచ్ఛం అందించి ఆత్మీయంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మొదటిసారి ఏజెన్సీ ప్రాంత మండలంలో పర్యటించిన రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ ను ఎమ్మెల్యే వెంకటేశ్వరస్వామి ప్రతిమ అందజేసి ఘనంగా సత్కరించారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాల అమలు పై పరస్పరం చర్చించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు,గిరిజన నాయకులు,స్థానిక ప్రజాప్రతినిధులు,అధికారులు మరియు పార్టీ నాయకులు పాల్గొన్నారుద

## శ్రీ శ్రీ దారాలమ్మ తల్లి హుండీ ఆదాయం రూ.4.76 లక్షలు



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, మార్చి 25:** జీకే వీధి మండలం దారకొండ ఘాటీ రోడ్డులో కొలువైన అంతర్రాష్ట్ర భక్తుల ఆరాధ్య దేవత శ్రీ దారాలమ్మ తల్లి ఆలయ హుండీ ఆదాయం రూ.4,76,750గా నమోదైనట్లు ఎండోమెంట్ అధికారులు తెలిపారు. అమ్మవారి జాతర అనంతరం హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఈవో సాంబశివరావు తెలిపారు. భక్తులు సమర్పించిన కానుకలను సక్రమంగా లెక్కించి ఈ మొత్తం నమోదైనట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ సుధారాణి, ఇన్‌స్పెక్టర్ ఉమాదేవి, ఈశ్వరరావు, ఉత్సవ కమిటీ సభ్యులు గడుతూరి చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

## కిమిడి రామ్ మల్లి నాయుడుకు జన్మదిన శు భాకాంక్షలు తెలిపిన గరివిడి మండల నాయకులు..



**చీపురుపల్లి నియోజకవర్గం పెన్ పవర్ మార్చి 25...** తెలుగుదేశం రాష్ట్ర కార్యదర్శి యువనేత కిమిడి రామ్ మల్లిక్ నాయుడు జన్మదిన సందర్భంగా ఈరోజు గరివిడి తెలుగుదేశం మండల పార్టీ అధ్యక్షుడు సారి పాక సురేష్ బాబు మరియు విజనగరం జిల్లా రైతు సంఘం అధ్యక్షులు పైల బలరాం, గరివిడి మండల దేశం నాయకులు అర్థమూరు మాజీ సర్పంచ్ రమణమూర్తి కిమిడి రామ్ మల్లిక్ నాయుడను కలసి గజమాలతో సత్కరించిజన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గొట్టిముక్కల సత్తిరాజు ,రాంబాబు, శ్రీను, ప్రసాద్ పాల్గొన్నారు.

## మత్స్యగెడ్డలో ఎన్డిఆర్ ఎఫ్ మాక్ డ్రిల్ అవగాహన కార్యక్రమానికి ఏర్పాటు

- అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు హాజరు కావాలి.
- ఎంపీడీవో కే ధర్మారావు, మండల తహసిల్దార్ కే భాస్కర అప్పారావు.



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, మార్చి 25.** అల్లూరి జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ ఆదేశాలతో ముంచంగిపుట్టు మండలంలో గల సుజనకోట పంచాయతీలో మత్స్యగెడ్డలో ఎన్ డి ఆర్ ఎఫ్ విజయవాడ కమాండెడ్ వివిఎన్ ప్రసన్న ఆధ్వర్యంలో విపత్తుల సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై మాక్ డ్రిల్ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించడం జరుతుందని ఎంపీడీవో కే ధర్మారావు, మండల తహసిల్దార్ కే భాస్కర అప్పారావు లు తెలిపారు. బుదవారం ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విపత్తుల సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు సూచనలపై ఎన్ డి ఆర్ ఎఫ్ కమాండెంట్ వివిఎన్ ప్రసన్న ఆధ్వర్యంలో మాక్ డ్రింక్ నిర్వహించి ప్రజలకు, ప్రజా ప్రతినిధులకు, వివిధ శాఖల అధికారులు అవగాహన కల్పిస్తున్నామని, ప్రతి ఒక్కరు ఈ కార్యక్రమానికి పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఐ భాస్కర్, విఆర్ఓ చెండా రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వంలో ట్రైకార్‌కు పునరుజ్జీవం



**స్టాఫ్ రిపోర్టర్,పాడేరు,పెన్ పవర్, మార్చి 25:** ఐదేళ్లపాటు నిర్జీవంగా ఉన్న ట్రైకార్ సంస్థ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పునరుజ్జీవం పొందుతోందని ఏపీ ట్రైకార్ రాష్ట్ర డైరెక్టర్ కూడా కృష్ణారావు తెలిపారు. పాడేరు, జి. మాడుగుల మండలాల్లో ట్రైకార్ యూనిట్లు ఏర్పాటు చేసేందుకు నిరుద్యోగ యువత ఎంపిక కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత ప్రభుత్వంలో ట్రైకార్ వ్యవస్థ పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందని విమర్శించారు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సంస్థను బలోపేతం చేసి, గిరిజన ప్రాంతానికి చెందిన డైరెక్టర్‌ను నియమించడంతో నిరుద్యోగ యువతకు ఆర్థిక సహాయం, ఉపాధి అవకాశాలు అందుతున్నాయని తెలిపారు. పాడేరు మండలంలో 68 మంది, జి. మాడుగుల మండలంలో 91 మంది నిరుద్యోగ యువతను ట్రైకార్ యూనిట్ల ఏర్పాటు కోసం ఎంపిక చేసినట్లు తెలిపారు. ఎంపికైన వారికి ప్రత్యేక శిక్షణ ఇచ్చి, యూనిట్లు స్థాపించేందుకు సహకారం అందిస్తున్నామని పేర్కొన్నారు. అలాగే చింతపల్లి మండలం తాజంగి జలాశయంలో పర్యాటక రంగంలో ఉపాధి కల్పించేందుకు కొందరు యువతను ఎంపిక చేసి వారికి మూడు బోట్లు అందిస్తున్నట్లు తెలిపారు. ముంచంగిపుట్టు మండలంలో చేపల వేటకు అవసరమైన వలలు, మూడు బోట్లు పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. అరకులో గిరిజన మహిళలు, యువతకు డ్రైవింగ్ శిక్షణ ఇచ్చేందుకు ట్రైకార్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నిరుద్యోగ యువత, మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించేలా పలు కార్యక్రమాలను అమలు చేస్తూ ట్రైకార్‌కు కొత్త గుర్తింపు తీసుకొస్తున్నామని పేర్కొన్నారు. ఈ అవకాశాలను యువత సద్వినియోగం చేసుకొని తమ భవిష్యత్తును బలోపేతం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో జి. మాడుగుల ఎంపీడీవో డేవిడ్ రాజ్, బీజేపీ మండల అధ్యక్షుడు రీమల కళ్యాణం, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

## అన్నదాత సుఖీభవ పై విస్తృత డోర్ టు డోర్ అవగాహన



**చింతూరు, పెన్ పవర్, మార్చి 25:** చింతూరు మండలంలోని జువ్విగూడెం గ్రామంలో రైతన్న మీకోసం అన్నదాత సుఖీభవ కార్యక్రమం బుధవారం నిర్వహించబడింది. కార్యక్రమంలో భాగంగా గ్రామంలో విస్తృతంగా డోర్ టు డోర్ ప్రచారం చేపట్టారు. ఈ కార్యక్రమానికి చింతూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మొహమ్మద్ జమాల్ ఖాన్ నేతృత్వం వహిస్తూ, రైతుల వద్దకు నేరుగా వెళ్లి అన్నదాత సుఖీభవ పథకం ప్రయోజనాలను వివరించారు. ప్రతి రైతు ఇంటిని సందర్శిస్తూ పథకం ద్వారా లభించే ఆర్థిక సహాయం, అర్హతలు, దరఖాస్తు విధానం వంటి అంశాలను స్పష్టంగా తెలియజేశారు. రైతుల సమస్యలను స్వయంగా తెలుసుకుంటూ, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని జమాల్ ఖాన్ హామీ ఇచ్చారు. ముఖ్యంగా చిన్న, సన్నకారు రైతులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా బలపడాలని ఆయన పిలుపునిచ్చారు. అదేవిధంగా గ్రామంలో నిర్వహించిన సమావేశంలో కూడా అన్నదాత సుఖీభవ పథకం ప్రాముఖ్యతను వివరించి, రైతుల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొని డోర్ టు డోర్ ప్రచారాన్ని విజయవంతం చేశారు.

## ఆదిరెడ్డి దళిత వ్యతిరేక వైఖరి ఖండిస్తూ వైసిపి శ్రేణులు నిరసన

**ఆ పార్టీ నుండి బహిష్కరించాలి దళితులకు క్షమాపణ చెప్పాలి**



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, మార్చి 25:** ఒక కుటుంబ వివాదంలో దళితులను అవమానపరిచిన మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు పై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేయాలని, తెలుగుదేశం పార్టీ నుండి చంద్రబాబు బహిష్కరించాలని, దళితులకు భేషరతుగా క్షమాపణలు చెప్పాలని వైఎస్ఆర్సిపి దళిత నాయకులు, డిమాండ్ చేశారు. దళితులను కించపరిచారన్న ఆడియో సోషల్ మీడియాలో వైరల్ అయిన సందర్భంగా దళితుల మనోభావాలను దెబ్బతీసిన ఆదిరెడ్డి అహంకారపూరిత వైఖరిని ఖండిస్తూ వైఎస్ఆర్సిపి శ్రేణులు, దళిత వర్గాలు సంయుక్తంగా బుధవారం స్థానిక గోకవరం బస్టాండ్, అంబేద్కర్ విగ్రహం వద్ద పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టారు. అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ నిరసన కార్యక్రమంలో కూటమి ప్రభుత్వం డౌన్ డౌన్, ఆదిరెడ్డి అరాచకాలు నశించాలని, దళితులకు క్షమాపణ చెప్పాలని, ఆదిరెడ్డి పై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేయాలని తెలుగుదేశం పార్టీ నుంచి బహిష్కరించాలని ఆందోళనకారులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్సిపి రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షులు టిజిఆర్ సుధాకర్ బాబు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వంలో దళితులపై దాడులు, దౌర్జన్యాలు పెచ్చుమీరుతున్నాయని, నిత్యం రాష్ట్రంలో ఏదో ఒక చోట దళితులపై దాడులు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఒక ఎమ్మెల్యే తండ్రి గా, ప్రజా ప్రతినిధిగా పనిచేసిన మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు దళితులను కించపరిచిన చేసిన వ్యాఖ్యలు అహంకారపూ రితమని , వివక్షతతో కూడుకున్నవని ఆయనపై ఎస్సీ, ఎస్టీ ఎట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. దళితులకు బేషరతగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వంలో దగా పడిన దళితులకు వైఎస్ఆర్సిపి, న్యాయం జరిగేంత వరకు అండగా నిలుస్తుందన్నారు. మాజీ న్యాయమూర్తి, దళిత మేధావి జడ శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీలో చాలామంది ఎంపీలు, ఎమ్మెల్యేలు, నాయకులు దళిత వర్గాలను వేధిస్తున్నాయని, అక్రమ కేసులు బనాయిస్తున్నారని మండిపడ్డారు. పార్టీలు మారిన,

ప్రభుత్వాలు మారినా దళితులపై దాడులు మాత్రం ఆగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు . సామాజికంగా, రాజకీయంగా విద్యాపరంగా, చైతన్యవంతమైన తూర్పుగోదావరి జిల్లాలో ఎమ్మెల్సీ గా చేసిన అప్పారావు దళితులను అవమానకరంగా మాట్లాడటం అంబేద్కర్ రాజ్యాంగాన్ని ధిక్కరించినట్లేనని ఆయనపై తప్పనిసరిగా ఎస్సీ ఎస్టీ కేసు పెట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పోలీసులు కేసు నమోదు చేయని యెడల న్యాయపరంగా ఏ స్థాయి వరకు అయినా వెళ్లి కేసు పెట్టేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. దళితులను కించపరిచిన అప్పారావు వైఖరి పై సొంత తెలుగుదేశం పార్టీలోని దళిత నాయకులు ఆత్మ పరిశీలన చేసుకోవాలని అన్నారు. ఆదిరెడ్డి అప్పారావు మాట్లాడిన విధంగా వైసిపి పార్టీ వారు మాట్లాడితే ఈపాటికి కేసులు పెట్టి జైలుకు పంపించేవారని అన్నారు . కూటమి ప్రభుత్వంలో దళితుల ఆత్మగౌరవం, రక్షణ కోసం పోరాటం చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. మాజీ ఎమ్మెల్యే తలారి వెంకటరావు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం వచ్చిన రెండు సంవత్సరాల నుంచి దళితులపై దాడులు జరుగుతూనే ఉన్నాయని ప్రధానంగా ప్రజాప్రతినిధుల పాత్ర ఎక్కువగా ఉందన్నారు. ఒక వివాదంలో పెద్దమనిషిగా ఉన్న మాజి ప్రజా ప్రతినిధి దళితులను కులం పేరుతో దూషించడం, చంపేస్తానని బెదిరించడం, దాడులు చేయడం గర్హనీయమన్నారు. మాజీ ఎంపీ భరత్ మాట్లాడుతూ, ఉభయ తెలుగు రాష్ట్రాల్లో సంచలనం కలిగించిన దళితులపై దూషణ, దాడుల సంఘటనలో మాజీ ఎమ్మెల్సీ అప్పారావును తెలుగుదేశం పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సంఘటనలో ఆదిరెడ్డి అప్పారావుకు తెలుగుదేశం పార్టీ అధిష్టానం షోకాజు నోటీసు కూడా ఇవ్వలేదని, దళితుల రక్షణ పట్ల ఆ పార్టీ అధిష్టానానికి ఆలోచన లేదా అని ప్రశ్నించారు. దళితుడిని కొట్టి, హత్యాయత్నం చేసిన ఆయనపై కేసు నమోదు చేయని పోలీస్ అధికారులు బాధితునీ పైన కేసు పెట్టడం దారుణమన్నారు. టిడిపి దళితులు ఆత్మ పరిశీలన చేసుకోవాలన్నారు. కేసు కట్టేంతవరకు ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. దళిత వర్గాలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి శ్రేణులు, నాయకులు, మహిళలు, దళిత వర్గాలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com